ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 27.0

10న అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ మెగా పీటీఎం : కలెక్టర్

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి):అన్ని పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోను నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మెగా పీటీఎం 2.0 ఏర్పాట్లపై సోమవారం జిల్లాలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. జిల్లాలోని 558 ప్రైవేటు పాఠశాలలు,140 ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొనేలా ఆహ్వానించాలని సూచించారు. మొక్కుబడిగా మెగా పీటీఎంను నిర్వహించకుండా పండుగ వాతావరణంలో జరపాలని కోరారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీజీ పంకజ్‌కుమార్, ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీశ్రీ శర్మ, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.ఆర్.కే.ఎ.ప్రసాద్, ఏలూరుజోన్ నాయకులు వెంకటేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష

ఏలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర, జిల్లా ఆర్థిక పురోగతికి దోహదపడే వ్యవసాయ అనుబంధ రంగాలపై పూర్తి దృష్టి పెట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం అధికారులతో వ్యవసాయ అనుబంధ రంగాలపై నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కింద ఇప్పటి వరకు గుర్తించిన 5,169 హెక్టార్లలో ఈ నెలాఖరులో ప్లాంటేషన్‌ను పూర్తి చేయాలన్నారు. జిల్లా ఉద్యాన,వ్యవ సాయాధికారులు రామ్మోహన్, హబీబ్ బాషాలు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నులశాఖ జేసీగా నాగార్జునరావు బాధ్యతలు



ఏలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌గా డాక్టర్ బి.నాగా ర్జునరావు ఏలూరులోని నరసింహారావుపేటలోని కార్యా లయంలో సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. విజయనగరం నుంచి బదిలీపై వచ్చినఆయన ఇక్కడ విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన పి.రమాకోటేశ్వరరావు విజయనగరం జాయింట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నూతనంగా ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా విజయవాడ-3 నుంచి బదిలీపై వచ్చిన కేపీ శైలజాశ్రీ విధుల్లో చేరారు. వీరికి పలువురు ఉద్యోగ సంఘ నాయకులు బోకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఆగుతూ.. సాగుతూ!



పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు

- ఏళ్ల తరబడి పూర్తికాని వైనం
- పట్టించుకోని అధికారులు
- అసంపూర్తి పనులతో ప్రమాదాలు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, విద్యార్థులు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జాతీయ రహదారి విస్తరణ పనులు ఏళ్ల తరబడి ముందుకు కదలడం లేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు సమీక్షలు జరిపినా తుతూ మంత్రంగా పనులు ప్రారంభించి రెండు రోజుల్లోనే ముగించేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా విస్తరణ పనులు నిర్వహించాల్సి ఉన్నా ఎన్‌హెచ్ అధికారులు ఉదాసీనతతో లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కానీ ప్రజల పాలిట శాపంగా మారింది.

కైకలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పామర్రు నుంచి పశ్చిమగోదావరి జిల్లా దిగమర్రు వరకు 165వ జాతీయ రహదారి విస్తరణ పనులు ఆరేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. అయితే నేటికీ ఈ పనులు పూర్తి కాలేదు. కైకలూరు నియోజకవర్గంలో భైరవపట్నం నుంచి పెదపాలపర్రు వరకు 60 శాతం పనులు పూర్తయినా పలుచోట్ల పూర్తి స్థాయిలో పనులు నిర్వహించలేదు. కైకలూరు మండలంలో శింగాపురం నుంచి ఆలపాడు వరకు రహదారి నిర్మాణం ప్రజలకు దినదిన గండంగా మారింది. ఎక్కడికక్కడే విస్తరణ పనుల కోసం తవ్వకాలు చేసి వదిలివేయడంతో వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాత్రుళ్లు రహదారి కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నారు. శింగాపురంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. రహదారిపై దుమ్ము, రాళ్లు లేచిపోయి వాహనదారులపై పడుతున్నాయి. భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులపై రాళ్లు ఎగిరిపడి గాయపడ్డారు. దీంతో కొద్ది మేర విస్తరణ పనులు పూర్తిచేసి ఏడాదిగా మరలా వదిలివేశారు. రోడ్డు విస్తరణ కోసం రెండేళ్ల క్రితం తవ్విన గోతుల్లో తుమ్మ మొక్కలు, జమ్ము దట్టంగా పేరుకుపోయింది. శింగాపురం నుంచి ఆలపాడు వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల పంటబోదెలపై కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఎక్కడ చూసినా రహదారి సగభాగం తవ్వేసి వదిలివేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



భుజబలపట్నంలో ఎన్‌హెచ్ విస్తరణ పనులు నిలిపివేయడంతో రహదారిపై మొలిచిన ముళ్ళచెట్లు, జమ్ము

డ్రెయిన్ల నిర్మాణంలో అష్టవంకర్లు..

ప్రణాళికబద్ధంగా విస్తరణ పనుల్లో డ్రెయినేజీ నిర్మాణం చేయాల్సి ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా అష్టవంకర్లు తిప్పుతూ డ్రెయినేజీ నిర్మాణాన్ని (మిగతా 8వ పేజీలో)

అర్జీలు సత్వర పరిష్కారం

» కలెక్టర్ వెట్రిసెల్వి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను కలెక్టర్ వెట్రిసెల్వి స్వీకరించారు. మొత్తం 394 అర్జీలు అందాయి. ప్రతీ అర్జీని పరిశీలించి ఎండార్స్మెంట్లను ఇవ్వాలని, సంబంధిత ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

డీఎస్పీ, సీఐ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చు : ఎస్పీ



వృద్ధుడి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా ఇకపై ప్రజలు తమ ఫిర్యాదులను సమీప సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు, సర్కిల్ పరిధిలోని అధికారులకు లేదా జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమర్పించవచ్చని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీతో పాటు ఏఎస్పీ సూర్య చంద్రరావు ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 55 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఫిర్యాదుల ప్రక్రియను పారదర్శకంగా, కాగిత రహితం నిర్వహిస్తున్నామన్నారు. పెదవేగి నుంచి ఒక వృద్ధుడు ఫిర్యాదు చేయడానికి రాగా ఎస్పీ, ఏఎస్పీ స్వయంగా అతని వద్దకు వెళ్లి ఫిర్యాదులోని అంశాలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పెదవేగి సీఐకి ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు.

సాగుకు సాయం

- సార్వా నుంచి పంటలకు రుణ పరిమితి పెంపు
- డీసీసీబీ ద్వారా రూ.2500 కోట్లు రుణాలందించాలని లక్ష్యం

■ లోపలి పేజీలో..

రూప్‌చంద్ ధర పతనం

పట్టుబడితో నష్టం.. జాప్యమైతే మేత భారం!

కొబ్బరి అధరహో

■ లోపలి పేజీలో..



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

కైకలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో స్టాక్‌బోర్డులు ఖచ్చితంగా పాటించి ధరలను ఎప్పటికప్పుడు తెలపాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం కైకలూరులో పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు.ధరల బోర్డు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. మండల వ్యవసాయాధికారిణి దివ్య పాల్గొన్నారు.

పెయ్యేరు పంచాయతీపై విచారణకు నోటీసులు జారీ

ముదినేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదులపై ఈనెల 10న నిర్వహించనున్న విచారణకు హాజరు కావాలని సంబంధిత అధికారులు, ఫిర్యాదిదారులకు విచారణాధికారి, జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో టి.నికెల్ నోటీసులు జారీ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు దూబా చంద్రకాంత్, షేక్ అల్లా భక్షు, రెడ్డి వెంకటేశ్వరరావులతోపాటు మండల డిప్యూటీ ఎంపీడీవో, అభియోగాలు వచ్చిన కార్యదర్శులుగా పని చేసిన వారందరూ విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు.

మాకెన్నాళ్లీ.. బాధలు..!

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆవేదన
- ఓ పక్క గోదావరి గుబులు..
- మరో పక్క పరిహారం కోసం పడిగాపులు

కుక్కునూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి పునరావాస కాలనీలకు తరలిస్తామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే క్షేత్రస్థాయిలో వందలాదిమంది నిర్వాసితులకు పరిహారం అందలేదు. ఓ పక్క గోదావరిలో వరద పెరుగుతుండడం నిర్వాసిత గ్రామస్థుల్లో గుబులు రేపుతోంది. ఎప్పుడు ముంచెత్తుతుందోనని భయపడుతున్నారు. పరిహారం అందకపోవడంతో గ్రామాల్లోని ఇళ్లు ఖాళీ చేసేందుకు మొగ్గు చూపడం లేదు.

'అయ్యా.. మాకు అన్ని అర్హతలున్నాయి పరిహారం ఇప్పించండి' అంటూ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్నారే కానీ సమస్య పరిష్కరించడం లేదు. 41.15 కాంటూరు లెవెల్ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తొలుత 25 గ్రామాలను ముంపునకు గురవుతాయని గుర్తించారు. కుక్కునూరు మండలంలో ఎనిమిది, వేలేరుపాడులో 17 గ్రామాలను ముంపులో చూపించారు. ఈ క్రమంలో నిర్వాసితులకు ఈ ఏడాది జనవరి 3వ తేదీన దాదాపు రూ.850 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారు. నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారంతో పాటు కోల్పోతున్న ఇళ్లకు, పునరావాస కాలనీలో ఇళ్లు వద్దనుకున్న వారికి పరిహారం చెల్లించారు. అయితే ఇంకా వందలాది మంది నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. ఏనాడు గ్రామం విడిచి వెళ్లనివారి పేర్లు సైతం జాబితాలో లేకపోవడంతో వారికి పరిహారం అందలేదు. పునరావాస కాలనీలో ఇళ్లు వద్దనుకున్న వారికి దాదాపు 3.85 లక్షలు పరిహారం చెల్లించాలి. గొమ్ము గూడెంలో భర్త చనిపోయిన సుమారు 20 మంది మహిళలకు పరిహారం అందలేదు.

కుక్కునూరు ఏ.బ్లాక్‌లో 120 మంది, చివ్వాకలో 110 మంది ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఇంటి పరిహారం అందలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లో ముంపునకు గురవుతున్న ఇళ్లు కూడా జాబితాలో గల్లంతవ్వడం శోచనీయం. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కాగా ఓ వైపు గోదావరి పెరుగుతోంది. పరిహారం అందని నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేసేందుకు మొగ్గు చూపడం లేదు. పరిహారం అందకుండా ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు.

ఏనాడు గ్రామం విడిచి వెళ్లలేదు..



నేను పుట్టిననాటి నుంచి ఏనాడు గ్రామం విడిచి వెళ్లలేదు. నా పేరు పునరావాస పరిహార జాబితాలో లేదు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాను. చేసేదిలేక చివరికి న్యాయం కోసం కోర్టుకు వెళ్లాను.

- కాకులమారి సుధాకర్, కుక్కునూరు ఏ.బ్లాక్ నిర్వాసితుడు.

పరిహారం అందలేదు



మాది గొమ్ముగూడెం. మా గ్రామం నుంచి ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించారు. నాకు మాత్రం పరిహారం అందలేదు. ఏ నాడు గ్రామాన్ని విడిచి వెళ్లలేదు. కానీ నాకు పరిహారం అందలేదు. అధికారులు న్యాయం చేయాలి.

- బావి కృష్ణమాచారి, గొమ్ముగూడెం.



పునరావాస కాలనీల్లో సౌకర్యాలు కల్పించండి..

» తహసీల్దార్‌కు రేపాకగొమ్ము గ్రామ ప్రజల వినతి

వేలేరుపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరదలు వచ్చే ప్రమాదం ఉందని, తాము గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లడానికి అక్కడ అనేక సమస్యలున్నాయని సౌకర్యాలు కల్పించి తమను కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని రేపాక గొమ్ము గ్రామస్థులు తహసీల్దార్ డీవీ. సత్యనారాయణకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. అధికారులు తమ గ్రామం ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లాలని ఒత్తిడి తెస్తున్నారని, కాలనీల్లో కనీస వసతులు కల్పిస్తే తాము వెళ్లడానికి సిద్ధమేనన్నారు. అరకొర వసతుల మధ్య అక్కడ ఉండలేమని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్ని సౌకర్యాలు వరదలు వచ్చేలోపే కల్పించేలా తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ముగిసిన సీపీఐ జిల్లా మహాసభలు

» నూతన కార్యవర్గం ఎన్నిక..
జిల్లా కార్యదర్శిగా మన్నవ కృష్ణచైతన్య



కృష్ణచైతన్య



వెంకటేశ్వరరావు

చింతలపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో జరిగిన సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మహాసభల్లో చేసిన తీర్మానాలను జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం, ఉపాధి కల్పించాలని, ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారికి రైతులు, ప్రజలకు ఉపయోగపడేలా సర్వీస్ రోడ్లు నిర్మించాలని, చింతల పూడిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేయాలని, వరి, పామాయిల్, కోకో, పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, చింతల పూడి ప్రాంతంలో బొగ్గు నిల్వలను వెలికితీసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,పెదవేగిలోని ప్రభుత్వ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయం విడనాడాలని, టిడ్కో ఇళ్లను లబ్ధి దారులకు తక్షణమే అప్పగించాలని తదితర తీర్మానాలు చేసినట్టు తెలిపారు. కాగాఈనెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెకు పూర్తిగా మద్దతు ప్రకటించి నట్టు తెలిపారు. బండి వెంకటేశ్వరరావు, టి.బాబు, కంచర్ల గురవయ్య, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

సీపీఐ జిల్లా మహాసభలు ముగింపు సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శిగా బండి వెంకటేశ్వరరావు, 45 మంది జిల్లా సమితి సభ్యులు, 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు అక్కడక్కడా కొనసాగుతూనే ఉన్నాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.9 మి.మీ నమోదైంది. జిల్లాలో కేవలం తొమ్మిది మండలాల్లోనే వర్షాలు కురిశాయి. జీలుగుమిల్లి 39.4, వేలేరుపాడు 27.2, కుక్కునూరు 25.6, బుట్టాయిగూడెం 20, జంగారెడ్డిగూడెం 17.6, టి.నరసాపురం 12, పోలవరం 8.6, చింతలపూడిలో 2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జిల్లాలో వర్షాల రాకతో వరితో పాటు సార్వాలో సాగు చేసే ఇతర పంటలకు సంబంధించిన పనులలో రైతులు నిమగ్నమయ్యారు.

మెగా పీటీఎం రోజునే.. రెండోవిడత తల్లికి వందనం!

- జిల్లాలో ఒకటో తరగతి 22,233 మంది, ఇంటర్ ఫస్టియర్ 16,757 మందికి అడ్మిషన్లు
- నేడో, రేపో అర్హుల జాబితాలు

ఏలూరు అర్బన్, జూలై7(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం ఆర్థిక సాయానికి రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తును ముమ్మరం చేశారు. ఈనెల 10న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం) రోజున జిల్లాలో అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాలకు ఆర్థికసాయం రూ.13వేలు చొప్పున జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. తొలివిడతలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రెండోతరగతి నుంచి పదోతరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మొత్తం 2,15, 082మంది బాలబాలికల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో మొత్తం 1,40, 764 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసిన విషయం విదితమే. తాజాగా ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26)లో కొత్తగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 5వ తేదీ వరకు ఒకటో తరగతి అడ్మిషన్లు తీసుకున్న 22,233 మంది, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు పొందిన 16,757 మంది విద్యార్థులకు తల్లికి వందనం ఆర్థిక సాయాన్ని అందజేసేందుకు ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేయడానికి కసరత్తు, వడపోత ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలో జిల్లాలో ఒకటో తరగతిలో చేరిన బాలబాలికల్లో 4,156 మందికి సంబంధించిన వివరాల్లో తప్పులు దొర్లడంతో వాటిని మంగళవారం ఉదయంలోగా హెచ్ఎంల లాగిన్‌లలో సరిచేసి పంపాలని పాఠశాల విద్యాశాఖ సోమవారం ఆదేశాలు పంపింది. మొత్తంమీద మంగళ, బుధవారాల్లో అర్హులైన తల్లుల ఎంపిక జాబితాలను విడుదల చేస్తారని విద్యాశాఖవర్గాలు వివరించాయి. పాఠశాలలకు సంబంధించి అర్హులైన తల్లుల జాబితాలను నేరుగా టీచర్ల లీప్ యాప్‌లో పొందుపరుస్తారని తెలిపాయి.

10న ఆర్థికసాయం అందజేత

సోషల్ వెల్ఫేర్ జేడీ

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు ఈనెల 10న తల్లికి వందనం ఆర్థికసాయాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విశ్వమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థి పేరున వున్న బ్యాంకు ఖాతాకు, ఆధార్ నంబరుకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు. ఖాతాలేని విద్యార్థులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతా లేదా పోస్టాఫీసు బ్యాంకు ఖాతాను తెరిచి ఆధార్ నంబరుకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలన్నారు.

నేటి నుంచి 17 వరకు.. ఏలూరు జీఎన్‌టీ రోడ్డు రైల్వేగేటు మూసివేత

ఏలూరు క్రైం, జూలై7(ఆంధ్రజ్యోతి): ఏలూరు - దెందులూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 351 (489కి.మీ) వద్ద అత్యవసర మరమ్మతుల నిమిత్తం జూలై 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జూలై 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటును మూసివేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఎస్.లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు - దెందు లూరు రైల్వే స్టేషన్ మధ్య ఏలూరు జీఎన్‌టీ రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహనాలను ప్రత్యామ్నాయ రహదారి మీదుగా ప్రయాణించాల్సిందిగా ఆయన కోరారు.

సేవామూర్తి ఆనందరాజుకు నివాళి



నేడు విర్డ్‌కు సెలవు

ద్వారకాతిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): సేవాభావంలో శ్రీమంతుడు, రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు(67) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయన నిర్మించిన ద్వారకాతిరుమలలోని విర్డ్ ఆసుపత్రి వద్ద సోమవారం సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. ఆస్పత్రికి మంగళవారం సెలవు ప్రకటించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన ఆయన విశాఖపట్నంలో కన్నుమూశారు. ఫౌండేషన్ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఆయన దేశంలోని వివిధ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలు విరాళం ఇచ్చారు. ద్వారకాతిరుమలలో విర్డ్ ఆసుపత్రి నిర్మాణంలో కీలక భూమిక వహించారు. శ్రీవారి ఆలయంలో కోట్లాది రూపాయలతో మినరల్ వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు చేశారు. సంతాప సభలో ట్రస్ట్ చైర్మన్ రాజా ఎస్‌వి సుధాకరరావు, ఎస్‌వి.నివృతరావు, ఈవో ఎన్వీ ఎస్ఎస్ మూర్తి, ఆసుపత్రి ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, ఎం గుప్తా, వంశి , వైద్యులు భవ్యచంద్, బాలాజీ, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందరాజు మృతి తీరని లోటు

గణపవరం: రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు (67) మృతి తీరని లోటని, ఆయన మరణం బాధించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గణపవరంలో ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాజు వేగేశ్న ఫౌండేషన్ ద్వారా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఫౌండేషన్ ద్వారా అన్న సత్రాలు, వాటర్ ప్లాంట్లు, ఆసుపత్రుల్లో వసతి సదు పాయాలు వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అద్భుత సేవలందించారని సీఎం చంద్రబాబు అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో మంది హృదయాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆనందరాజు మృతి తీరనిలోటని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సీఎం చంద్రబాబు తెలిపారు.



డెట్రాయిట్ ప్రదర్శనలో నృత్య కళాకారులతో కేవీ సత్యనారాయణ

తానా సభల్లో కేవీఎస్‌కు ఘన సత్కారం

ఏలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అమెరికాలో డెట్రాయిట్‌లో నిర్వహించిన 24వ ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా మహోత్సవాలలో ఏలూరుకు చెందిన కేవీ.సత్యనారాయణ శిష్యులతో నృత్య రూపకం ప్రదర్శించారు. అమెరికా, కెనడా దేశాల నుంచి ఎన్నిక చేయబడిన 126 మందికి ఆయన శిక్షణ ఇచ్చి 'తరతరాల తెలుగు వైభవం' అనే నృత్య రూపకాన్ని ప్రదర్శించి అక్కడ ప్రజల మన్ననలను అందుకున్నారు. ఈ ప్రదర్శనలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కృష్ణదేవరాయుల పాత్రను పోషించారు. కేవీ.సత్యనారాయణ డెట్రాయిట్‌లో నెలరోజుల పాటు నర్తకులకు శిక్షణ ఇచ్చి ఈ ప్రదర్శన ఇచ్చారు. ప్రేక్షకులు నిలబడి కరతాళ ధ్వనులతో ఆయనను ప్రశంసించారు. ఈసందర్భంగా కేవీ. సత్యనారాయణను తానా కమిటీ గంగాధర్ నాదెళ్ల, ఉదయ్ చేపలమడుగు, సునీల్ పంత్ర అభినందించి ఘనంగా సత్కరించారు. ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్, మైత్రీ మూవీస్ అధినేత నవీన్ ఎర్నేని, దర్శకుడు రాఘవేంద్ర రావు, నటులు రాజేంద్రప్రసాద్, యువ నటుడు నిఖిల్ అభినందించారు.

సచివాలయాల ఏఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-3 సచివాలయాల్లో ఏఎన్ఎంలకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వేదికగా ఉమ్మడి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో జూమ్ విధానంలో ఏఎన్ఎంలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఆదివారం జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు చెందిన 75మందికి బదిలీలు పూర్తిచేయగా, సోమవారం రాత్రి 7.15గంటల వరకు, పట్టణ ప్రాంత సచివాలయాలకు చెందిన 170మందికి బదిలీలు పూర్తిచేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని వివరించారు. కాగా గ్రామ సచివాలయాల్లో 402 మందికి మంగళవారం ఉదయం నుంచే కౌన్సెలింగ్ ప్రారంభించి పూర్తిచేస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారం ఒక్కో ఏఎన్ఎం నుంచి బదిలీ వేకెన్సీలకు సంబంధించి ఐదు ఐచ్ఛికాలను రాతపూర్వకంగా తీసుకున్నామని, వాటిలో క్లియర్ వేకెన్సీలు లేనివారిని కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన ఖాళీల నుంచి ఎంచుకునే వెసులుబాటు కల్పించామన్నారు. కౌన్సెలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో గంగాభవాని, ఎఫ్ఆర్ఎస్ విభాగం నోడల్ ఆఫీసర్ భార్గవి పర్యవేక్షించారు.

కొబ్బరి అధరహో

ధర ఆల్‌టైం రికార్డ్

వెయ్యి కాయలు పశ్చిమలో రూ.20 వేలు.. తూర్పులో రూ.22 వేలు

ఆగస్టు నాటికి రూ.25 వేలకు చేరే అవకాశం



పాలకొల్లు, యలమంచిలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి అ'ధర'హో స్థాయిలో ఉండడంతో అటు రైతులు, ఇటు వ్యాపారుల్లో జోష్ నెలకొంది. నారికేళం ధరలు మునుపెన్నడూ లేని స్థాయికి ఎగబాకి ఆల్ టైం రికార్డు నెలకొల్పాయి. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ వెయ్యి కాయల ధర గరిష్ఠంగా రూ.20 వేలు ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో రూ.22 వేలు ఉంది. జూలై మాసాంతం, ఆగస్టులో వచ్చే వినాయకచవితి నాటికి ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఆగస్టులో రూ.25 వేలకు పైబడి ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తక్కువగా ఉన్నప్పటికీ ధర గణనీయంగా పెరగడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు. గడచిన మూడు, నాలుగేళ్లలో కొబ్బరి ధరలు తక్కువ. దీంతో రైతులు కొబ్బరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు రైతాంగం అంతగా ఆసక్తి కనబరచలేదు. కొబ్బరి చెట్లకు సకాలంలో సేంద్రియ, రసాయన ఎరువులు వేయకపోవడం, దుక్కి, నీటి తడులు ఎక్కువసార్లు పెట్టకపోవడంతో పాటూ, కొబ్బరిచెట్లకు తెగులుసోకి ఆకులు నల్లగా మారిపోవడం వంటి వాటితో కొబ్బరి కాయ పరిమాణం తగ్గింది. ప్రతి వంద కాయలలో 20 నుంచి 30 చిన్నకాయలు వస్తున్నాయి. దీంతో ఈ కాయలను వర్తకులు రెండింటిని ఒకటిగా లెక్కిస్తున్నారు. ఈవిధంగా రైతులు నష్టపోతున్నారు. మరోవైపు దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే కొబ్బరి రైతులు సంతృప్తిగానే ఉన్నారు. ప్రస్తుతం కొబ్బరి ధరలు గరిష్ఠస్థాయికి చేరడంతోపాటూ, భవిష్యత్తులో మార్కెట్ నిలకడగా ఉంటుందని అంచనాలు ఉండడంతో కొబ్బరి రైతులు కొబ్బరి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పక్వానికి వచ్చిన కాయలే దింపాలని, వచ్చే ఒకటి, రెండు నెలల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. అప్పటికి పక్వానికి వచ్చిన కాయలు ఉంటే రైతులకు లాభం చేకూరుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పచ్చికొబ్బరి గండేరా (ఢిల్లీ క్వాలిటీ) రూ.20 వేల నుంచి రూ.22వేలు పలుకుతోంది. 70-80 బత్తీల కాయలు వెయ్యి రూ.12 వేలు ఉండగా, నెంబరు కాయల ధర రూ.13 వేలు ఉంది. కురిడీ కాయల ధర రూ.25 వేలు ఉంది.

ఊపందుకున్న ఎగుమతులు

తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి దాదాపు 50 శాతానికి తగ్గిపోవడంతో ఇక్కడి కొబ్బరికి విపరీతమైన డిమాండ్ వచ్చింది. అంతేకాక ఉత్తరాది రాష్ట్రాల్లో కొబ్బరి పరిశ్రమలు వినియోగించే ఎండు కొబ్బరి ఇండోనేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి దిగుమతి తగ్గిన కారణంగా ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ పెరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ ప్రాంతానికి, తెలంగాణలో పలు ప్రాంతాలతో పాటు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఇంకా పలు ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతులు అవుతున్నాయి. ఏటా జూలై, ఆగస్టు నెల ప్రథమార్ధంలో బిహారు రాష్ట్రానికి కొబ్బరి ఎగుమతులు అవుతాయి. 15 రోజులుగా బిహారు రాష్ట్రానికి ఎగుమతులు మొదలయ్యాయి. ఒలిచిన కొబ్బరికాయలను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. బిహారు రాష్ట్రానికి మాత్రం కొబ్బరిచెట్ల నుంచి దించిన కాయలను నేరుగా ఎగుమతి చేస్తారు. మరికొన్ని రోజుల్లో బిహారుకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా కోనసీమ, పాలకొల్లు ప్రాంతాల నుంచి ప్రతీరోజూ సుమారు 50 నుంచి 70 లారీలు కొబ్బరికాయ ఎగుమతి అవుతుండేవి. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి సుమారు 100 పైబడి లారీల కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

పండుగలకు మరింత డిమాండ్

సాధారణంగా వినాయకచవితి, దీపావళి, కార్తీక మాసం సీజన్లలో కొబ్బరికి డిమాండ్ ఉంటుందని, దీంతోపాటు 2026 జనవరిలో మేడారం జాతర తేదీలను ఖరారు చేయడంతో కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండడంతో పాటూ, భవిష్యత్‌లో మార్కెట్ నిలకడగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలతో కొబ్బరి రైతులతో పాటు, వ్యాపారులు ఆచితూచి అమ్మకాలు చేస్తున్నారు.



ధర పెరగడంతో గిట్టుబాటు

రెండేళ్లుగా కొబ్బరి ధరలు తక్కువగానే ఉన్నాయి.. దీనికితోడు దిగుబడి 50 శాతానికి పడిపోవడంతో దింపు కార్మికులకు, కూలీలకు సొమ్ములు చెల్లించగా రైతులకు ఏమీ మిగలని పరిస్థితులు చవిచూశాం. దిగుబడి తగ్గినప్పటికీ ప్రస్తుతం కొబ్బరి ధర పెరగడంతో గిట్టుబాటవుతోంది. కొబ్బరికాయలకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తే కొబ్బరి రైతులకు మేలు జరుగుతుంది.

- చిలుకూరి ప్రసాద్, కొబ్బరిరైతు, యలమంచిలి



రెట్టింపైన ఎగుమతులు

పాలకొల్లు ప్రాంతం నుంచి ప్రతిరోజూ 30 లారీల కొబ్బరి ఎగుమ తయ్యేది. ప్రస్తుతం డిమాండ్ నేపథ్యంలో 60 లారీలపై ఎగుమతువుతున్నాయి. వర్షాల కారణంగా కొబ్బరి దింపు, వొలుపు వాయిదా పడుతోంది. వర్షాలు తగ్గితే ఎగుమతికి అవకాశం ఉంటుంది. ధరలు నిలకడగా ఉంటే రైతులు, వ్యాపారులతో పాటు, కొబ్బరికార్మికులకు మేలు జరుగుతుంది. 2 నెలలు కొబ్బరి మార్కెట్ నిలకడగా ఉండవచ్చు.

- సీహెచ్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు, కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్



రూప్ చంద్

ధర పతనం

పట్టుబడితో నష్టం.. జాప్యమైతే మేత భారం!

- కిలో కనిష్ఠ ధర రూ.93
- వ్యాపారుల మార్జిన్ రూ.4
- పెట్టుబడి కూడా దక్కదు
- మేత మరింత భారం
- ఆక్వా రైతు కుదేలు

నిడమర్రు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రూప్‌చంద్ చేపల ధర అత్యంత కనిష్ఠ స్థాయికి చేరడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. జూన్ ఆఖరి వారం నుంచి ధర పతనం అవుతోంది. వేసవిలో రైతు వద్ద కిలో రూ.128 పలికిన రూప్‌చంద్ చేప ధర ప్రస్తుతం రూ.95 ఉంది. ఒక కేజీకి సుమారు రూ.30 రైతు ధర కోల్పోతున్నాడు. కేజీ చేప పెంపకానికి రూ.95 నుంచి రూ.100 వరకు ఖర్చవుతుండడంతో సుమారు రూ.7 నష్టపోతున్నాడు. 10 టన్నుల సరుకు ఎగుమతికి సుమారు రూ.1.5 లక్షల నష్టం వస్తోంది.

సొమ్ము చెల్లిస్తేనే మేత

రూప్‌చంద్ చేప ధర కనిష్ఠ స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభం నుంచి చేపల మేతకు ఫీడ్ కంపెనీలు, డీలర్లు పెట్టుబడి పెడుతున్నారు. పట్టుబడి అనంతరం రైతుకు సొమ్ము అందిన తర్వాత వారికి చెల్లిస్తారు. ప్రస్తుతం పట్టుబడి లేకున్నా చేపకు మేత వేయాల్సిందే. సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామంటూ డీలర్లు షరతులు విధిస్తున్నారు. దీనితో రెండు రోజులకోసారి రైతులు మేత వేస్తున్నారు. ఈ కారణంతో చేప బరువు తగ్గి మరింత నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో రెండు నెలలు శ్రావణ మాసం పూజలు, వినాయకచవితి, దీపావళి అంటూ వచ్చే 5 నెలలు చేపల మార్కెట్‌కు గడ్డుకాలమే. మార్కెట్ మరింత తగ్గే అవకాశం ఉంటుందని ట్రేడర్స్ చెబుతున్నారు. పెరిగిన చేప నష్టానికి అమ్మలేక చేపల రైతు గట్టున పడ్డ చేపలా గిలగిలా కొట్టుకొంటున్నాడు. కనీసం చెరువు లీజు సొమ్ము కూడా దక్కదని వాపోతున్నారు.

వ్యాపారుల మార్జిన్.. రైతుకు భారం

రూప్‌చంద్ చేప సైజును బట్టి ధర పలికేది. కేజీ ధరలో ట్రేడర్స్ ధర 1 గ్రాముకు 2 పైసలు చొప్పున కేజీ చేపకు వంద గ్రాములు మార్జిన్‌గా తీసుకుంటారు. ప్రస్తుతం రైతు పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ట్రేడర్స్ మరింత కోత వేస్తున్నారు. మార్జిన్ రేటును 2 పైసల నుంచి 4 పైసలకు చేసి రైతులను దోచుకుంటున్నారు.

ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఒక కేజి ధర రూ.93 పలికితే ట్రేడర్ మార్జిన్ వంద గ్రాములు పోను 900 గ్రాములకు రూ.89 ధర దక్కుతోంది. 1 గ్రాముకు 4 పైసల చొప్పున వంద గ్రాముల ధర రూ.4 మొత్తం కేజీ ధరలో కోత వేస్తున్నారు. మార్జిన్ మొత్తం తీసివేస్తే రైతుకు రూ.89 లభిస్తోంది. గతంలో 2 పైసలు ప్రస్తుతం 4 పైసలు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.



ఆక్వా రైతుకు ధరాఘాతం

నిలకడగా ఉన్న మార్కెట్ ఒక్కసారిగా పతనం కావడంతో రైతులకు ధర క్షీణత శరఘాతమైంది. పట్టుబడుల వేళ ఒక్కసారిగా ధర కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని ప్రాంతాలలో 1 గ్రాముకు 4 పైసలు చొప్పున తక్కువ ధర కడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనితో కేజీ బేసిక్ ధరపై రూ.4 కోత పడుతోంది. ట్రేడర్స్‌తో మాట్లాడతాం.

తాడినాడ బాబు, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్



మేత ధర కూడా రావడం లేదు

20 ఎకరాల్లో రూప్‌చంద్ సాగుచేస్తున్నాను. ధర పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. కనీసం మేత రేటు కూడా దక్కడం లేదు. లీజు చెల్లించలేని పరిస్థితి. ప్రభుత్వం చర్యలు తీసుకుని మేత ధర తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. లీజు తగ్గినా చెరువులు చేయలేకపోతున్నాం. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోకపోతే రోడ్డుపడాల్సి పరిస్థితి నెలకొంది.

జి.చిన్నారావు, రైతు, ఫత్తేపురం

బదిలీ.. బంతాట!

గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ, విద్యా సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శుల ఆందోళన



సోషల్ వెల్ఫేర్ జేడీ కార్యాలయం వద్ద సంక్షేమ, విద్యా సహాయకుల ఆందోళన



ఏఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన మహిళా సంరక్షణ కార్యదర్శులు

ఏలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. బదిలీలకు దరఖాస్తు చేయని వారి స్థానంలో చేరాలని కొందరికి, ఒకే ప్రదేశంలో మూడు ఆప్షన్లతో ఇద్దరికి పోస్టింగ్ ఇవ్వడంతో ఉద్యోగులంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతలు బదిలీల వ్యవహారాలలో తల దూర్చడంతో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే బదిలీల వ్యవహారాన్ని చక్కబెడుతూ, తమకు అన్యాయం చేశారని మండిపడ్డారు. దివ్యాంగులు, స్పౌజ్ నిబంధనలను పట్టించుకోలేదని, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని సంక్షేమ, విద్యా సహాయకులు సోమవారం ఆందోళన బాట పట్టారు. ఏలూరులో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు లెక్క చేయకుండా సోషల్ వెల్ఫేర్ శాఖ బదిలీలు నిర్వహించిందని మండిపడ్డారు. బదిలీలకు దరఖాస్తు చేసుకోని వారి స్థానంలో కూడా పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారని, మూడు ఆప్షన్లో సంబంధం లేకుండా సుదీర్ఘ ప్రాంతాలకు బదిలీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే ప్రదేశంలో మూడు ఆప్షన్లు ద్వారా ఇద్దరికి పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వడం ప్రశ్నించారు. రూరల్ వారికి అర్బన్‌లో బదిలీ చేశారని, తక్షణం రీ కౌన్సెలింగ్ జరపాలని డిమాండ్ చేశారు.

మహిళా పోలీసులది అదే దారి..

మహిళా సంరక్షణ కార్యదర్శులు పలువురు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల్లో పారదర్శకత లేదన్నారు. వార్డు పరిధిలో పనిచేస్తున్న వారిని పక్క వార్డుకు, మండల పరిధిలో పనిచేస్తున్న వారిని పక్క మండలానికి బదిలీ చేయాలన్న నిబంధనలు పాటించలేదని మండిపడ్డారు. పంచాయతీల్లో పనిచేస్తున్న వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియారిటీకి ప్రాధాన్యత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఏఎస్పీకి వినతి

ఏలూరు క్రైం: బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. 1,2,3 మెరిట్ లిస్టుల ప్రకారం కౌన్సెలింగ్ జరగలేదన్నారు. సచివాలయ ఉద్యోగాల్లో 15 మార్కులు అదనంగా జత చేశాక విధుల్లో చేరిన వారికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. హడావుడిగా ఆప్షన్ పత్రాలు ఇచ్చారని, వారం గడిచాక బదిలీల జాబితా విడుదల చేశారన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి మెరిట్ ప్రకారం ట్రాన్స్‌ఫర్ చేయలేదని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

దిష్టి బొమ్మల్లా కియోస్క్‌లు

వైసీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల్లో ఏర్పాటు

నేడు నిరుపయోగంగా యంత్రాలు

కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



లింగపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు లబ్ధి చేకూరేలా వారికి మెరుగైన సేవలంది స్తామని గత వైసీపీ ప్రభుత్వం అనేక హామీలు గుప్పించింది. ప్రతి గ్రామంలో రైతులకు రైతు భరోసా కేంద్రాలు (రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. కోట్లాది రూపాయలతో ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఎల్ఈడీ టీవీలను, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసింది. ఒక్కో ఎల్ఈడీ టీవీ 45 వేలు, కియోస్క్ యంత్రం 75 నుంచి 80 వేల రూపాయలతో ప్రభుత్వం వీటిని కొనుగోలు చేసింది. వీటిని సరిగా వినియోగించకపోవడంతో కొన్ని నెలలకే మూలకు చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లాలోనే 520 రైతు సేవా కేంద్రాలు ఉండగా కోట్లాది రూపాయల వ్యయంతో 520 ఎల్ఈడీ టీవీలు, 520 కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసి జిల్లాలో అన్ని రైతుసేవా కేంద్రాలకు అందజేశారు. నాణ్యతలేని కియోస్క్ యంత్రాలను అందజేయడంతో వాటిలో బ్యాటరీలు సరిగా పని చెయ్యకపోవడం, ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంతో పాటు పలు సమస్యలతో అవి నిరుప యోగంగా మారాయి. వీటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన ఏజెన్సీలు కూడా పట్టించుకోకపోవడంతో స్థానిక అధికారులు వీటిని ఒక మూలకు చేర్చారు. వ్యవసాయశాఖ నుంచి రైతులకు సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన అన్ని రకాల సేవలకు వ్యవసాయశాఖ సిబ్బంది తమ సెల్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండానే కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చుచేసి నాణ్యతలేని, యంత్రాలు, టీవీలను కొనుగోలు చేసిందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు ఉపయోగపడేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..



కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారిన సంగతి మా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుమందులు, ఈ-పంట నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన వంటి పనులకు ప్రస్తుతం సిబ్బంది సెల్‌ఫోన్‌లను విని యోగిస్తున్నాం. వీటిని త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- హబీబ్ భాషా, ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి

ఆటో పెట్టించి స్కూల్‌కు..



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): దూరం నుంచి వస్తున్న పిల్లలకు ఉపాధ్యాయులే ఆటో ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఏదోలా పాఠశాలకు రప్పించేందుకు కృషి చేస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో గతేడాది 54 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకూ చదువుకునేవారు. ఈ ఏడాది ఆ సంఖ్య పడిపోతుందని గుర్తించారు. రెండు కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు వస్తున్న భగత్ సింగ్ కాలనీ విద్యార్థుల కోసం నెలకు రూ.5 వేలు సొంతంగా ఇచ్చి పదిమంది విద్యార్థులకు ఆటో ఏర్పాటు చేశారు. దీంతో ఆ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 48కి చేరింది. నలుగురు ఉపాధ్యాయులు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంపై ఎంఈవో హనుమ అభినందిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచుతాం..



మా పాఠశాలలో విద్యా బోధన బాగున్నా దూరం నుంచి రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారిని పాఠశాలకు రప్పించేందుకు మా వంతుగా ఆటో ఏర్పాటు చేసి విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు చేశాం. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ఖర్చు భరిస్తున్నాం.

- వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు

అల్లూరి మెమోరియల్ హాలు నిర్మాణానికి చర్యలు

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ హామీ



మంత్రి వర్మకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

భీమవరంటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును స్మరించుకునే విధంగా మెమోరియల్ హాలు ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకుంటానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. భీమవరం పాత బస్టాండ్ సమీపంలోని ఏఎస్ఆర్ మెమోరియల్ హాల్‌ను పునర్నిర్మించాలని సాధన కమిటీ సభ్యులు బి. బలరామ్, జేఎన్‌వీ గోపాలన్ తదితరులు సోమవారం మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్డీవోతో ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సాధన కమిటీ సభ్యులు బి. వాసుదేవరావు, కనుమూరి సత్యనారాయణ రాజు, కంతేటి వెంకట్ రాజు, దండు శ్రీనివాస్ రాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న సరస్వతి మహరాజ్

ఆలమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు 19 ఏళ్లుగా పశ్చిమగోదావరి జిల్లా శృంగ వృక్షం నుంచి పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర సాగిస్తున్నట్లు శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి మహరాజ్ తెలిపారు. సోమవారం శిష్యబృందంతో కలసి ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర ఆలమూరు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏకాదశి ఆదివారంనాడు యాత్ర ప్రారంభమైందని నాలుగు రోజుల్లో పిఠాపురం స్వయంభు శ్రీదత్త క్షేత్రం చేరుకుంటామని వివరించారు. హిందూత్వం ప్రతి గడపకు చేరేందుకు, ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దారిలో అనేక మంది తమతో కలసి పాదయాత్ర సాగిస్తున్నారని చెప్పారు. బుధవారం నాటికి పిఠాపురం దత్త పీఠానికి చేరుకోనున్నట్లు ఆయన వివరించారు.



ములపర్రు పంచాయతీ వద్ద గ్రామస్థుల నిరసన

నిధుల దుర్వినియోగంపై విచారణ

పెనుగొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములపర్రు పంచాయతీ సర్పంచ్ భర్త జీతాలు పేరు చెప్పి రూ.7,75,844 నిధులు డ్రా చేసినట్లు భీమవరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు గత నెల 23న గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం ఈవోపీఆర్‌డీ వై. కిషోర్‌బాబు ములపర్రు పంచాయతీలో గ్రామ ప్రజలతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ ఒక్క 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంత దోచేస్తే గత 4 ఏళ్ళుగా ఎంత నగదు పక్కదారి పట్టించారో విచారణ చేయాలని అధికారులను కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద కొంత సేపు నిరసన తెలిపారు. సర్పంచ్, ఆనాటి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్‌డీ కిషోర్‌బాబు మాట్లాడుతూ నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.



వీరవాసరంలో పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యులు

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన

వీరవాసరం (భీమవరంటౌన్), ఉండి జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు సోమవారం వీరవాసరంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ఆలయాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని తెలుసుకుని ఫొటోలు తీసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఎంపిక చేసుకున్న ఇళ్లకు వెళ్ళిన బృందం ఇంట్లో మరుగుదొడ్డి ఉందా.. వినియోగిస్తున్నారా, ఇంటింటా చెత్త సేకరిస్తున్నారా? మురుగు కాలువలు పంచాయతీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారా? అని ఆరా తీసి సమాధానాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఈ పరిశీలనలో స్వచ్ఛ సర్వేక్షణ్ జిల్లా కో-ఆర్డినేటరు ఎం. మధుమతి, పి. సత్తిబాబు, జిల్లా కన్సల్టెంట్ ఎం. సంతోష్‌కుమార్, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచ్ చికిలే మంగతాయారు, పంచాయతీ విస్తరణ అధికారి ఫణికుమార్, కార్యదర్శి కే. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలం ఆరేడులో సంపద తయారీ కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్, వ్యక్తిగత మరుగుదొడ్లను స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు దినేష్, రామకృష్ణ తదితరులు సంపద కేంద్రం వద్ద వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మానందం, డిప్యూటీ ఎంపీడీవో రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరినాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు.. తప్పిన ముప్పు



పెనుమంట్ర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దైవ దర్శనానికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో పెనుమంట్ర మండలం పొలమూరులో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. కంటైనర్ వాహనాన్ని తప్పించబోయి కరెంటు స్తంభాన్ని ఢీకొన్నారు. కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణనష్టం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన గోపాలకృష్ణతో పాటు ఐదుగురు వ్యక్తులు శ్రీశైలంలో స్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా పొలమూరు అంబేడ్కర్ విగ్రహం సమీపంలో కంటైనర్ వాహనం తప్పించబోయి మహేంద్ర టయోటా వాహనం ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొంది. విద్యుత్ వైర్లు తెగిపడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఘర్షణకు పాల్పడిన 13 మంది అరెస్ట్

కామవరపుకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయ కల్యాణ మండపానికి సమీపంలో గత వారంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదంలో దాడులకు పాల్పడిన 13 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు తడికలపూడి ఎస్ఐ పి.చిన్నారావు సోమవారం తెలిపారు. వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని, మరికొందరు పరారీలో ఉన్నారని, సీసీ ఫుటేజీలు, విచారణలు నిర్వహించి సంఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయడం జరుగుతుందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు.

సాగుకు సాయం



- డీసీసీబీ ద్వారా రూ.2500 కోట్లు రుణాలందించాలని లక్ష్యం
- ఆప్కాబ్ నుంచి కూడా రైతులకు రుణమందించే యోచన

సార్వా నుంచి పంటలకు రుణ పరిమితి పెంపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంలో కూలీల నుంచి విత్తనాల వరకు అన్ని ఖర్చులు పెరుగుతున్నాయి. బ్యాంకులు అందించే రుణాలు మాత్రం తక్కువ. రైతన్నలు వ్యవసాయ పెట్టుబడికి వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి బ్యాంకులు, సహకార సంఘాలు రైతులకు రుణ పరిమితిని పెంచాయి. ప్రభుత్వం కూడా ముందస్తు సార్వాకు సన్నద్ధం చేయనుండటంతో రైతులకు ఆ మేరకు పరపతిని కల్పించనున్నారు.

రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వం ఇటీవల రుణ పరిమితిని పెంచుతూ ఉత్తర్వులను జారీ చేసింది. దీనితో ఖరీఫ్ సీజన్‌లో రూ.2500 కోట్ల సత్వర పంట రుణాలను ఇవ్వాలని డీసీసీబీ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో డీసీసీబీ 34 శాఖల పరిధిలో 258 సొసైటీల కింద రుణాలను రెండు పంటల కాలాలకు రైతులకు రుణాలు సమకూర్చేది. ఈ సంస్థను ఆర్థిక నష్టాలను వెంటాడుతున్నప్పటికీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఇటీవల పెంచిన పెట్టుబడి సాయం పరిమితికి లోబడి రూ.2500 కోట్లు రుణాలను ఇచ్చి తీరాలని ఇటీవల లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఉమ్మడి పశ్చిమలో ఏటా మొత్తం 5,90,598 మంది పంట రుణాలను పొందుతున్నట్లు సమాచారం. ప్రతీ సొసైటీలో గతంలో ఇచ్చిన రుణం కంటే ఈసారి 15 శాతం అదనంగా రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతులకు సగటున పంటల వారీగా రూ.9 వేల నుంచి రూ.17వేల వరకు రుణ పరిమితి పెంచారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు సాయం విస్తరించే యోచనలో ఉన్నారు. ప్రతీ సొసైటీలో రైతులకు సత్వరం అడిగిన వారి రుణం అందివ్వడానికి సర్వ సన్నద్ధంగా ఉన్నారు.

ఆప్కాబ్ నుంచి రూ.300 కోట్ల రుణం : పి.సింహాచలం, డీసీసీబీ సీఈవో



రైతులను, సొసైటీలను బలోపేతం చేయడానికి ఆప్కాబ్ నుంచి డీసీసీబీకి రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందివ్వాలని కోరాం. త్వరలో విడుదల అవుతాయని భావిస్తున్నాం. ఆ నిధులు రాగానే ఈ సార్వా నుంచే పామాయిల్, ఆక్వా సాగుకు ఏరియాల వారీగా సొసైటీల్లో రుణాలను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక రాబోయే రోజుల్లో అనుబంధ రంగాలకు రుణాలను విస్తరణ చేస్తాం. ఇదే సందర్భంలో మొండిబకాయిలు వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఉమ్మడి జిల్లా ఏపీపీలకు ల్యాప్‌టాప్



ల్యాప్‌టాప్ అందిస్తున్న ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ వృత్తిలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో పనిచేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ల్యాప్‌టాప్‌లను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డిజిటల్ రికార్డులు, కోర్టు ప్రోసెసింగ్ వంటి అంశాల్లో మరింత చురుకుదనం సాధించవచ్చన్నారు. కేసుల విచారణ వేగవంతం కావడంతో పాటు ముద్దాయిలకు శిక్షలు నిర్ధారించడంలో ఇదివరకు ఎదురయ్యే సవాళ్లు తగ్గుతాయన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని న్యాయవ్యవస్థలో సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్లకు ల్యాప్‌టాప్‌లను మంజూరు చేసిందన్నారు. వీటిని వినియోగించి త్వరితగతిన బాధితులకు న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.



వైష్ణవ్‌ను అభినందిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

నీట్‌లో వైష్ణవ్‌కు స్టేట్ ర్యాంక్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో చిన తాడేపల్లికి చెందిన గమిడి వైష్ణవ్ స్టేట్ 392వ ర్యాంకు సాధించారు. వైష్ణవ్ తండ్రి మల్లేశ్వరరావు (మల్లి) నీలాద్రిపురంలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తుంటారు. తల్లి గృహిణి. మెడిసిన్ చదివి మాస్టర్ సర్జన్ కావడమే తన లక్ష్యమని వైష్ణవ్ తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవ్‌ను ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందించారు.

ఎలక్ట్రానిక్ కాటా మోసాలు.. రొయ్య రైతుకు నష్టం



పాలకొల్లులో మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి బోనం చినబాబు

భీమవరం టౌన్/పాలకొల్లు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రొయ్య పట్టుబడి సమయంలో ఎలక్ట్రానిక్ కాటాలో మోసాలతో రైతులు నష్టపోతున్నారని ఆక్వా రైతులు కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారంఅర్జీ అందజేశారు. ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జేకేఎఫ్ సుబ్బరాజు, తులసిరామ్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కాటాల్లో మార్పులతో కిలోకు 60 గ్రాములు, టన్నుకు 50 కిలోల రొయ్యలు అధికంగా వెళ్లిపోతున్నాయని వివరించారు. ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లుతుందన్నారు. మోడ్ ఆప్షన్ లేని ఎలక్ట్రికల్ కాటా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతులను మోసం చేస్తున్న తీరును కలెక్టర్‌కు స్వయంగా మిషన్ ద్వారా చూపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణం చర్యలుతీసుకోవాలని తూనికలు, కొలత శాఖ అధికారులను ఆదేశించారు.

యలమంచిలిలో గుర్తించిన కాటా మోసం

తూకంలో మోసంతో ఆక్వా రైతులను నష్టాల పాలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం కార్యదర్శి బోనం చినబాబు కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులు క్రితం యలమంచిలి మండలంలో చామకూరి దినకర్ రొయ్యల పట్టుబడి పట్టాడన్నారు. కిలో రొయ్యలను 920 గ్రాములుగా కాటా చూపించి మోసానికి పాల్పడడం గమనించామన్నారు. దళారులు ఇద్దరుపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రావెల్ అలవెన్స్ నెలకు రూ.600

- దూర ప్రాంత విద్యార్థులకు ప్రోత్సాహం
- ప్రభుత్వం తాజా నిర్ణయం

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రవాణాభత్యం (ట్రావెల్ అలవెన్సు) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నుంచి పాఠశాలకు ఒక కిలోమీటరు పైబడి దూరం నుంచి వచ్చే 1-5 తరగతుల విద్యార్థులు, మూడు కిలోమీటర్ల పైబడి దూరం నుంచి వచ్చే ప్రాథమికోన్నత తరగతులు (6, 7, 8) విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ ట్రావెల్ అలవెన్సు ఇవ్వనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరిగిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నిర్ణీత దూరం నుంచి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు జిల్లాలో సుమారు 2వేల మందికిపైగా ఉన్నట్టు అధికారులు గుర్తించగా, వారందరికీ రవాణా భత్యం ఇవ్వనున్నారు. కాగా ఈ అలవెన్సును ఎప్పటి నుంచి ఇచ్చేదీ ప్రభుత్వం నుంచి ఇంతవరకు స్పష్టత లేదు.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కైకలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి):వంతెనపై కారు అడ్డుగా పెట్టారని దాడి చేసిన ఘటనలో పది మందిపై కేసు నమోదు చేసినట్టు కైకలూరు రూరల్ ఎస్.ఐ. వి.రాంబాబు తెలిపారు. వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేశ్, అతని తమ్ముడు, చెరువు కాపాలదారు ఆదివారం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకుని తిరిగి ఆలపాడు వైపు కారులో వస్తూ మార్గమధ్యలో సర్కారు కాలువ వంతెనపై ఫొటోలు దిగేందుకు ఆగారు. ఆ సమయంలో భీమవరానికి చెందిన కొందరు కారులో వస్తుండగా వంతెనపై కారు అడ్డుగా ఉండడంతో హారన్ కొట్టినా కారు తీయకపోవడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు సర్ది చెప్పి పంపించారు. అయినా ఆలపాడు గ్రామంలోని పెట్రోలు బంకు వద్ద ఘంటసాల సురేష్ కారుకు అడ్డుగా పెట్టి అతనిపై భీమవరానికి చెందిన వారు ముకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో సురేశ్, అతని చెరువు కాపలాదారుకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో స్థానికులు వారిని కైకలూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువెళ్లారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు భీమవరానికి చెందిన పదిమందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- కోర్టుకు పంపిన పోలీసులు

భీమవరం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల ఒక ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించి రచ్చకెక్కాడు. భీమవరం పట్టణంలోని ఒక మునిసిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.నాగేశ్వరరావు గత ఏడాది పాఠశాలలు జరిగే సమయంలో 6, 7 తరగతుల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఎవరికైనా చెబితే ఇంటికి పంపిస్తానని బెదిరించడంతో వారు మిన్నకుండిపోయారు. మళ్ళీ ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఉన్నతాధికారులకు విషయం తెలియడంతో విచారణ చేశారు. 6, 7 తరగతుల విద్యార్థినుల వద్దకు వెళ్లి ఫిర్యాదు తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ కృష్ణాజీ విచారణ చేపట్టి నాగేశ్వరరావును అరెస్ట్ చేశారు. సోమవారం కోర్టులో హాజరుపరచగా అతనికి బెయిల్ వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరుపుతామని అధికారులు తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడి దాడి

పెనుమంట్ర, జూలై 7(ఆంధ్రజ్యోతి): మల్లిపూడిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి కోసం తనయుడు దాడి చేసిన సంఘటనలో తీవ్ర గాయాలతో తండ్రి ఆస్పత్రి పాలయ్యాడు. మల్లిపూడికి చెందిన గుడిమెట్ల వెంకటరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి మధ్య సోమవారం మాటా మాటా పెరగడంతో విచక్షణా రహితంగా రాడ్డుతో తండ్రి తలపై కొట్టినట్టు స్థానికులు తెలిపారు. దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న కుమారుడికి సొమ్ము ఇవ్వకపోగా ఆస్తి అమ్ముకునేందుకు ఒప్పుకోకపోవడంతో దాడికి పాల్పడినట్లు సమాచారం. రక్తసిక్తమైన వెంకటరెడ్డి వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపినట్టు బంధువులు చెబుతున్నారు ఈ సంఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఇరగవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో 2021వ సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితునికి 20ఏళ్ల జైలు, లక్షా 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ సోమవారం భీమవరం పోక్సోకోర్టు జడ్జి బి.లక్ష్మీనారాయణ తీర్పును వెలువరించారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన నీలాపు గోపీకృష్ణ అదే గ్రామానికి చెందిన బాలికపై లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బాలిక తల్లిదండ్రులు ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ జానా సతీశ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో వివరాలు సమర్పించారు.కోర్టు విచారణలో నీలాపు గోపీకృష్ణపై నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్టు ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు. ఈ కేసులో బాలిక తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.బ్రహ్మయ్య వాదనలు వినిపించారు.

పదో విడత 208 మొబైల్స్ రికవరీ

ఇప్పటి వరకు రూ. 2 కోట్ల 40 లక్షల 30 వేల విలువ చేసే మొబైల్స్ అందజేత





రికవరీ చేసిన మొబైల్ అందజేస్తున్న ఎస్పీ నయీం, పోలీసులు రికవరీ చేసిన ఖరీదైన మొబైల్స్

భీమవరం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పోలీసులు సెల్ ఫోన్ల రికవరీ చాకచక్యంగా నిర్వహిస్తున్నారు. ఏ జిల్లాలో లేని విధంగా మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఫోన్లు పోగొట్టుకోవడం, కొందరు దొంగలు ఫోన్లు దొంగిలించడం, ఎక్కడో ఒకచోట పెట్టి మరచిపోవడం.. ఇలా ఫోన్లు పోగొట్టుకున్నవారికి బాధ్యతగా పోలీసులు అందజేస్తున్నారు. ఈ కోణంలోనే సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చేతుల మీదుగా 208 సెల్ (రూ.31 లక్షల 20 వేలు) ఫోన్లను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా పశ్చిమ గోదావరి జిల్లా ఫోన్లు రికవరీలో ముందంజలో ఉందన్నారు.ఎవరైనా బాధితులు ఫోన్లు పోగొట్టుకుంటే 91549 66503 నంబర్‌కు హాయ్ అని పంపగానే మెస్సేజ్ వస్తుంది. ఆ మెస్సేజ్ లింక్‌లో మొబైల్ వివరాలను పొందుపరిస్తే అది పోలీసు కార్యాలయంలో నమోదవుతుంది. ఆ రకంగా జిల్లాలో ఇప్పటికి పది విడతలుగా 1,612 ఫోన్లు (రూ. 2 కోట్ల 40 లక్షల 30 వేల విలువ) బాధితులకు అందించినట్టు తెలిపారు.సెల్‌ఫోన్ దొరికితే సొంతానికి వాడుకోకుండా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద బిల్లులు లేని ఫోన్లు కొనకూడదని తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎండీ అహ్మదున్నీసా, ఎస్ఐ నాగేశ్వరరావు, ఏఎస్ఐ రత్నారెడ్డి, సిబ్బంది వీజీఎస్ కుమార్, బి.శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, పి.లక్ష్మీకుమారి, పాపారావు, ప్రసాద్ బాబు, భాస్కర్, ప్రసాద్, అనిల్ కుమార్, అబ్బాస్, శాంతి అనే వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. డీసీఆర్‌బీ సీఐ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ పుల్లారావు తదితరులు ఉన్నారు.

బైకు అదుపు తప్పి యువకుడి మృతి



వేలేరుపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో కిందపడిపోయి ఒక యువకుడు మృతి చెందాడు. రామవరం గ్రామానికి చెందిన మడకం ప్రకాశ్(25) అనే యువకుడు వేలేరుపాడు వైపు వెళ్లి తన గ్రామానికి బైక్‌పై వెళ్లే క్రమంలో స్థానిక సబ్ స్టేషన్ వద్ద బైకు అదుపు తప్పడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవడంతో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు ప్రకాశ్‌కి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. గ్రామంలోని అందరితో కలివిడిగా ఉండే ప్రకాశ్ ఆకస్మిక మృతితో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చింత చెట్టు నుంచి కిందపడి ఒకరి మృతి

నరసాపురం రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుస్తుంబాదా అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎం.పెద్దిరాజు చింత చెట్టు ఎక్కి చిగురు కోస్తుండగా కాలుజారి కిందపడి మృతి చెందాడు. ఎస్సై వెంకట సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దిరాజు చింత చిగురు కోసుకుని అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఈక్రమంలో సోమవారం చెట్టు ఎక్కి చింతచిగురు కోస్తుండగా కాలు జారి చెట్టుపై నుంచి కిందకు పడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఏరియా అస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పెద్దిరాజు భార్య, ఇద్దరు పిల్లలు, భార్య గల్ఫ్‌లో ఉంటోంది. కుమార్తె మేరీ ఫిర్యాదు మేరకు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు... కేసు నమోదు

ముదినేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి మండలం చిగురుకోట శివారు నరసన్నపాలేనికి చెందిన బాలిక(17) అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాలిక గత ఏడాది పదవ తరగతి పాస్ కాకపోవడంతో తల్లితో పాటు కూలి పనులకు వెళ్తోంది. ఎప్పటిలాగానే పనులకు వెళ్లి వచ్చిన ఆ బాలిక ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించింది. సోమవారం వేకువ జామున బాలిక తల్లి నిద్ర లేచి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. గ్రామంలోనూ, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏసీబీ కేసులో సరైన సాక్ష్యం చెప్పని ఒకరికి ఏడాది జైలు

రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పు

ఏలూరు క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో సరైన సాక్ష్యం చెప్పకపోవడంతో ఒకరిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే సరైన సాక్ష్యం చెప్పలేదనే నేరం రుజువు కావడంతో అతడికి ఏడాది జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగలక్ష్మి, సదైవ కృప అనే ఇద్దరు 2000 సంవత్సరంలో ప్రభుత్వ పథకం నిధులతో ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే వారికి ఒక బిల్లు సొమ్ము రాలేదు. వారి బిల్లులు తయారు చేసి గృహ నిర్మాణ శాఖకు పంపించడానికి అప్పటి ఉండ్రాజవరం మండలం గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్‌లోని అసిస్టెంట్ ఇంజనీర్ యలమంచిలి ప్రకాశరావు ఒక్కొక్కరి నుంచి రూ.3 వేలు లంచం డిమాండ్ చేశారు. ఆ సొమ్ము ఇవ్వడం ఇష్టం లేక అదే గ్రామానికి చెందిన బసవా నాగవెంకట గణేశ్ ద్వారా ఏలూరు ఏసీబీ డీఎస్పీని 2009 మార్చి 6న ఆశ్రయించారు. దీంతో బసవా నాగవెంకట గణేశ్ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఏసీబీ డీఎస్పీ జీఎస్ఎన్.మూర్తి కేసు నమోదు చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఆరు వేల రూపాయల లంచాన్ని బసవ నాగవెంకట గణేశ్ నుంచి ఏఈ యలమంచిలి ప్రకాశరావు తీసుకుంటుండగా అప్పటి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ టి.కనకరాజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. ఈ కోర్టు రాజమహేంద్రవరం స్పెషల్ జడ్జి ఫర్ ఎస్పీ అండ్ ఏసీబీ కోర్టులో విచారణ సాగింది. అయితే ఫిర్యాదుదారుడైన వెంకట నాగగణేశ్ ఉద్దేశపూర్వకంగా సరైన సాక్ష్యం చెప్పకపోవడంతో ఈ కేసు 2019 జూన్ 28న కొట్టివేసి ఏఈ యలమంచిలి ప్రకాశరావును నిర్దోషిగా విడుదల చేశారు. అయితే ఈ కేసులో ఫిర్యాదుదారుడైన బసవా నాగవెంకట గణేష్ ఉద్దేశపూర్వకంగానే సాక్ష్యం చెప్పాడని అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈ కేసు రాజమహేంద్రవరంలోని మూడవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌లో విచారణ సాగింది. దీంతో బసవా నాగ వెంకట గణేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. దీంతో అతడిని రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించినట్టు ఏలూరు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

శ్రీవారికి రూ. 1.44 లక్షల ఆదాయం

ఏలూరుకార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి):స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా దేవాలయానికి ఒక్కరోజే రూ.లక్షా 44 వేల 121 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్ తెలిపారు. అంతరాలయ దర్శనాల ద్వారా 45 వేల 280, విరాళాల ద్వారా 10 వేల 640, అన్నదానానికి 34 వేల 561, పులిహోర ప్రసాదాల ద్వారా 38 వేల 835, లడ్డూ విక్రయాల ద్వారా 14 వేల 805 రూపాయల ఆదాయం లభించినట్టు వివరించారు.

హడ్కో నుంచి పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

ద్వారకాతిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి):ఎం.నాగులపల్లి జడ్పీ పాఠశాలకు, అలాగే ప్రాథమిక పాఠశాలకు హడ్కో కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా దాదాపు లక్ష విలువైన ఫర్నిచర్‌ను సంస్థ ప్రతినిధులు సోమవారం అందజేశారు. మాజీ సర్పంచ్ సిర్రా భరత్ సూచనల మేరకు మాజీ హెచ్‌ఎం రమణారావు 2024 నవంబర్‌లో పాఠశాల నుంచి హడ్కో ఉన్నతాధికారులకు స్కూల్ ఫర్నిచర్ కోసం వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలోనే హడ్కో నుంచి రీజనల్ చీఫ్ బీఎన్‌ఏ మూర్తి 12 కుర్చీలు, 12 టేబుల్స్, 8 ఫ్యాన్లు పాఠశాలకు అందజేశారు.

10న పేరెంట్స్ మీటింగ్.. ఎస్పీకి ఆహ్వానం



దెందులూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సమావేశానికి జిల్లా ఎస్పీని ఆహ్వానించినట్టు కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ తెలిపారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారని ఈ నెల 10న మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నందున సమావేశానికి రావాలని విద్యా కమిటీ చైర్మన్ బీదా గణేశ్, టీడీపీ నాయకులు కసుకుర్తి రామకృష్ణ, సీనియర్ న్యాయవాది వెదుళ్ల రాంబాబులు ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

మాకా ఉర్దూ స్కూలు పరిణామాలపై ఆర్జేడీ విచారణ

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని మౌలానా అబుల్ కలాం అజాద్(మాకా) మున్సిపల్ ఉర్దూ హైస్కూల్లో గతకొన్ని రోజులుగా కొనసాగుతున్న వరుస అవాంఛనీయ పరిణామాలపై జిల్లా విద్యాశాఖ దృష్టిసారించింది. ఇక్కడి పాఠశాలతో పాటు, కొత్తగా ఇటీవల ఏర్పాటు చేసిన పాఠశాలల్లో ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన విద్యార్థుల అభీష్టం మేరకే జరగాల్సి ఉండగా, కొందరి స్వార్థ ప్రయోజనాల కోసమే వివాదాలను సృష్టిస్తున్నట్టు విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలోనే మాకా స్కూల్లో పనిచేస్తున్న ఓ టీచరుపట్ల కొందరు అభ్యంతరకరంగా ప్రవర్తించినట్టు వార్తలురావడం, వాటిని స్థానిక ప్రజా ప్రతినిధులు ఖండించడం, తదనంతర పరిణామాలన్నింటినీ విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు జిల్లా అధికారులు తీసుకెళ్లారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు నేరుగా స్కూల్ వద్దకెళ్లి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేబాధ్యతలను పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(కాకినాడ ఆర్జేడీ)కి అప్పగించారు. కొద్ది రోజుల్లోనే కాకినాడ ఆర్జేడీ స్కూలుకు విచారణనిమిత్తం రానున్నారు.

ఉద్యోగుల సమస్యలపై సీఎస్‌కు వినతి

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని, ఈలోగా 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్‌కు వినతిపత్రాన్ని ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య అందజేశారని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు తెలిపారు.ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు పెండింగ్‌లోవున్న మూడు డీఏలు వెంటనే ప్రకటించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు, సరెండర్ లీవులు, ఏపీజీఎల్‌ఐ, పీఎఫ్ బకాయిల చెల్లింపునకు నిధులు విడుదల చేయాలని కోరారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేదంటే చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు అన్నారు. జడ్పీ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్రవాహనాలను తనిఖీలు చేశారు. వాహనపత్రాలు సరిగాలేవని, లైసెన్సులేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలకు ఖచ్చితంగా నెంబర్ ప్లేట్‌లు ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

నారాయణపురం వంతెన పాడవ్వడంతో ట్రాఫిక్ కష్టాలు



కాలవగట్టున, చేబ్రోలులో వాహనాల రద్దీ దృశ్యం

ఉంగుటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నారాయణపురం వంతెన పాడవ్వడంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం చేస్తున్న ప్రయత్నాలు పలు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. తాజాగా శనివారం ఈ రూటులో భారీ వాహనాల నియంత్రణ కోసం ఇనుప గడ్డర్‌ను నిర్మించిన కొద్ది గంటల్లోనే వాటిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. సోమవారం ఇదే రూటులో కాల్వగట్టు వెంబడి సుమారు అర కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. పోలీసులు క్రేన్ తెప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ



ఏలూరుకార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగస్వామి ఆలయంలోని బాల త్రిపుర సుందరీదేవి అమ్మవారికి సోమ వారం భక్తులు, మహిళలు సంయుక్తంగా వివిధ రకాల ఆహార పదార్థాలతో, పిండి వంటలతో, పసుపు, కుంకుమలతో మేళ తాళాలతో నగరంలో ప్రదర్శన నిర్వహించి అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని ఆషాడం సారెగా వడి బియ్యంతో పాటు సమర్పించారు.ఆలయ ప్రధానార్చకులు దండిబొట్ల కనకసుందరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఏకరుద్రాభిషేకం, రుద్రహోమం, నిర్వహించారు. సౌందర్యలహరి బృందం మినీ సుందరాకాండను పారాయణం చేశారు. వెత్స స్వర్ణలత బృందం లలితా సహస్రం, సిద్ధ మంగళ స్తోత్రాలను ఆలపించారు. ఆలయ ఈవో సి.హెచ్.చిననాగేశ్వరరావు సేవలందించారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం పీటర్ మృతి

ఏలూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్, వీజేపీపీ ఎయిడెడ్ స్కూల్ హెచ్‌ఎం పి.శ్యామ్‌పీటర్ సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. అనారోగ్యంతో గత మూడ్రోజులుగా ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందడం ఉపాధ్యాయ లోకానికి తీరనిలోటని ఆ సంఘ నాయకులు శ్రీనివాసరావు, టి.రామారావు, ఆనంద్ కుమార్, తదితరులు నివాళులర్పించారు.

ఆగుతూ..సాగుతూ!

(5వ పేజీ తరువాయి)

చేపట్టారు. ముదినేపల్లిలో రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షానికి రహదారిపై ప్రయాణించలేని పరిస్థితులు నెల కొన్నాయి. మండవల్లిలో నాలుగు లైన్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. అయితే అనేకచోట్ల భూసమస్యలు తలెత్తడంతో గ్రామంలో డివైడర్ లేకుండా కొద్దిమేర నిర్మాణం చేశారు. రహదారిని కుదించి నిర్మాణం చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణంలో భూసేకరణ జరగని ప్రదేశాల్లో అష్టవంకర్లు తిప్పుతూ నిర్మాణం చేశారు. కొన్నిచోట్ల నిర్మాణాన్ని వదిలివేశారు.

పల్లెవాడలో ప్రారంభం కాని బైపాస్



పల్లెవాడలో ప్రారంభం కాని పనులు

కైకలూరు మండలం పల్లెవాడలో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిలో అనేక మలు పులు ఉండడంతో పూసపాటి అమ్మవారి ఆలయం నుంచి ఎలాంటి మలుపులు లేకుండా బైపాస్ నిర్మాణం చేసేందుకు ప్రణాళిక చేశారు. అందుకు కావాల్సిన భూసేకరణ జరిగినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణపు పనులు చేపట్టలేదు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం చేయాల్సి ఉండగా నేటికీ పనులు ప్రారంభించలేదు.

పనులు పూర్తిచేయకపోతే ఆందోళన

ఐదేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా నేటికీ పూర్తికాలేదు. ఎక్కడికక్కడ రహదారి తవ్వేసి వదిలివేయడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవిలో పనులు చేయ కుండా వర్షాకాలంలో పనులు ప్రారంభించి రెండు రోజుల్లో తూతూ మంత్రంగా ముగించేస్తున్నారు. నిరంతరాయంగా విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేయకుంటే ఆందోళన చేస్తాం.

- కంతేటి సాయి, భుజబలపట్నం గ్రామస్థుడు



పుట్లగట్లగూడెంలో కరపత్రాలు పంచుతున్న నాయకులు



ఏలూరులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి



కన్నాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

టీడీపీతోనే సుపరిపాలన సాధ్యం

ఇంటింటి ప్రచారం నిర్వహించిన నాయకులు

బుట్టాయగూడెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సోమవారం దొరమామిడిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేస్తూ ప్రభుత్వానికి తెలియజేశారు. నాయకులు మొగపర్తి సోంబాబు, కాకర్ల సురేశ్, యంట్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, మద్దిపాటి శ్రీను, పఠాన్ రసూల్ ఖాన్, కుంజా గంగులు, సున్నం పోసిరావు, సోదెం దుర్గారావు, దువ్వెల దుర్గారావు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: రాష్ట్రాభివృద్ధిలో టీడీపీ పాత్ర ఎంతో ఉందని మండలాధ్యక్షుడు పారేపల్లి రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కన్నాపురంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చిన రాజు, టీడీపీ గ్రామాధ్యక్షుడు బొమ్మా గంట్లయ్య, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు) పేర్కొన్నారు. గోపన్నపాలెంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు చింత సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జి మారగాని సత్యనారాయణతో కలిసి మిల్లుబాబు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వేగవరంలో నాయకులు ఏనుగు కేబుల్ శ్రీను, బజారు గణేశ్, మాజీ ఎంపీటీసీ భవాని ప్రసాద్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మనీదుపాడులో సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చమ్మలమూడి రాము, తెలుగు యువత నాయకుడు బొర్రా చందులతో కలిసి మిల్లుబాబు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును ఆరా తీశారు. వేగవరం, కొత్తపల్లి, గోపన్నపాలెం ప్రధాన రహదారి ప్రాంతాల్లో జనసేన నాయకులు మాజీ సర్పంచ్ కొండేటి హనుమతు, తోట రామకృష్ణ, సింగలూరి నరసయ్య, సిరిపల్లి అంజనేయులు, పూజారి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. సోమవారం నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి హాజరయ్యారు. మండల కన్వీనర్ ముత్యాల స్వామి, కార్యదర్శి పొట్నూరి సింహచలం, భీమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మేకా వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగు పరిచేందుకు పీ4 పథకానికి రూపకల్పన చేసినట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 48వ డివిజన్‌లో పర్యటించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సూపర్ 6 పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చంటి ఇంటింటా తిరిగి ఏడాది పాలనను అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

● కామవరపుకోట: తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని రామన్నపాలెం పంచాయతీలో నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, టీడీపీ శ్రేణులు నెక్కలపు సూర్యనారాయణ, ఘంటా రవి, సత్యనారాయణ, కొత్తూరు రవి, మెడంకి సత్యనారాయణ, కుటుంబరావు, మానుకొండ యోహాను, లక్ష్మణరావు, గెడ్డం వసంతరావు, కృష్ణ, జాలపర్తి రాంబాబు, పాకలపాటి ధర్మారావు, మద్దిపోటి గోపాలకృష్ణ, నాగ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

● పెదవేగి :సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సంక్షేమంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు మారగాని సుబ్రహ్మణ్యం, యర్రా హనుమంతు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని పుట్లగట్లగూడెంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శీలం వెంకటరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, ప్రగడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

టి.నర్సాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో మినీ ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని బజరంగి భేరి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కోట రామచంద్రపురంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో కె.రాములు నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నర్సాపురం మండలంలోని లంబాడి తండాల అభివృద్ధికి నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన టండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. టండాల్లో రహదారులు మరమ్మతులు నిర్వహించి తాగునీరు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని కోరారు. గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు, భూక్యావేణుగోపాల్, ప్రేమ్‌చంద్, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రరావుపేటలో ఆందోళన చేస్తున్న కార్మికులు



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ

ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు వేతనాలివ్వండి

ఏలూరుకార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం రామచంద్రరావుపేటలోని సర్వీస్ రిజర్వాయర్ సెంటర్ వద్ద ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన జోనల్ మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ చేసే వరకు కనీస వేతనం 26 వేల రూపాయలు నెలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.యూనియన్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, నారా శ్రీను, వెంకట్రామయ్య, పళ్లె కిషోర్ పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయొద్దు..

ఏలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వమని, రెడ్ బుక్‌లో రాసుకున్న హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడియస్‌యు) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ ప్రశ్నించారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకి నాని, మహర్షి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిందని, విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన జీవో నెంబర్ 19, 20 తో, పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బి వినోద్, ఏలూరు నగర అధ్యక్షకార్యదర్శులు సొంగ సునీల్‌కుమార్, వై.యశ్వంత్, సిహెచ్ ప్రవీణ్, కె.పుజిత్, తదితరులు పాల్గొన్నారు.



కంద్రికగూడెంలో ఆవిర్భావ సభలో పాల్గొన్న నాయకులు



శ్రీనివాసపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

చింతలపూడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని చింతలపూడిలో ఘనంగా నిర్వహించారు.ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి కార్యకర్తలు ర్యాలీని ప్రారంభించారు. అలాగే మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.కిరణ్‌బాబు, యు.ప్రభాకర్, వేణు, సురేశ్, కె.ఏలియ, టి.మల్లయ్య పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: వర్గీకరణతోనే ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. బుట్టాయగూడెం అరుంధతీ పేట వద్ద సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పోలవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండే పాటి రామకృష్ణ, బొబ్బర ఎలీషా, తెల్లం దేవరాజు, ఎం.ముసలయ్య, షేక్ ఇమామ్, షేక్ బాజీ, చిడిపి గంగాధరావు, నక్కా శివాజీ, డి.నాగేంద్ర పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని శ్రీనివాసపురంలో పొలిమేర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధూ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఆర్పీఎస్ జెండాను మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు అయినపర్తి వెంకటరత్నం ఆవిష్కరించారు. కౌన్సిలర్ కనుమూరి లావణ్య, తొమ్మండ్రు వెంకటేశ్వరరావు, జొన్నకూటి శ్రీను, కలపాల ప్రసాద్, లాగు అంకాలయ్య పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: రాజ్యాధికారం దిశగా ఎంఆర్‌పీఎస్ అడుగులు వేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జ్ కె.సత్యం అన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కంద్రికగూడెంలో సోమవారం నిర్వహించారు.ఎంఎస్‌ఈ జిల్లా అధ్యక్షులు కందుల రమేశ్, మున్నుల జాన్‌గురునాథ్ ఎం.తిరుపతిరావు, రాజేశ్‌బాబు, జి.ప్రసాద్, కె.యోహాన్, జిజ్జవరపు ప్రతాప్, ఎలిషా, జాన్సన్ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల వద్ద కేకుకట్ చేసి మిఠాయిలు పంచారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఈపూరి చినబాబు, మధు, రత్నరాజు, దుర్గారావు, ఎలేటి భాస్కరరావు, పూలపల్లి రవి, సుబ్బారావు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : పి.అంకంపాలెంలో ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మందకృష్ణమాదిగ పుట్టిన రోజు కేక్‌కట్ చేశారు. మాదిగ రిజర్వేషన్ కోసం మందకృష్ణ చేసిన కృషి గుర్తు చేశారు.



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్మిక హక్కుల కోసం ఉద్యమించాలి

టి.నర్సాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. టి.నర్సాపురంలో సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రజాహక్కులను కాలరాస్తూ మరోపక్కన కార్మిక హక్కులను కూడా కుదించి వేస్తుందన్నారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మిక, కర్షక, ఉద్యోగరైతాంగం తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

● ఏలూరుకార్పొరేషన్ : కార్మికుల హక్కుల పరిరక్షణకై ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు నగరంలో సోమవారం పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోటారు సైకిళ్ల ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, బి.వెంకట్రావు, ఆర్.శ్రీనివాసడాంగే, బి.సోమయ్య, పి.కన్నబాబు, కె.కృష్ణమాచార్యులు, వి.వి.ఎన్.ప్రసాద్, ఎన్.నెహ్రూబాబు, ఎస్.నాయుడు, కె.విజయలక్ష్మి, జాన్‌బాబు, పళ్ళెం కిషోర్ పాల్గొన్నారు.

● కామవరపుకోట : మోదీ అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు టి.వి.ఎస్.రాజులు విజ్ఞప్తి చేశారు. బృందంలో కరపత్రాలు అందచేసి సమ్మె విజయవంతానికి విస్తృత ప్రచారం చేశారు. జి.సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రోషన్‌పై దుష్ప్రచారాన్ని ఖండించిన నాయకులు

జంగారెడ్డిగూడెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌పై అసత్య ప్రసారం చేయడంపై టీడీపీ పట్టణ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, టీడీపీ నియోజక వర్గ మీడియా కో ఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్, రాష్ట్ర మహిళా నాయకురాలు పగడం సౌభాగ్యవతి, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్యే రోషన్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు.

● కామవరపుకోట: చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌పై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నట్టు కామవరపుకోట టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కోనేరు గార్డెన్ నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ జి.సుధీర్ బాబు, ఎస్సీ సెల్ నాయకులు స్వామినాథం, బీసీ సెల్ నాయకులు నూతి రాటాలు పాల్గొన్నారు.

తరగతులను పునరుద్ధరించండి

ద్వారకాతిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన తరగతులను పునరుద్ధరించి తమ పిల్లల చదువుకు సహకరించాలని పలువురు గ్రామస్థులు, వైసీపీ నేతలు ఎంఈవోకు, పాఠశాల హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని దొరసానిపాడులో 8వ తరగతి వరకూ ఉన్న స్కూల్‌ను ఐదో తరగతికి కుదించి 6,7,8 తరగతులను తొలగించడం సరికాదన్నారు. తూర్పు గోదావరి జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అన్సారీ బాషాతో పాటు నేతలు, గ్రామస్థులు పాఠశాలకు వచ్చి వినతిపత్రాలు అందజేశారు.

కొవ్వలి హైస్కూల్లో దంత పరీక్షలు

దెందులూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోజు ఉదయం సాయంత్రం తప్పనిసరిగా రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని దుగ్గిరాల సెయింట్ జోసఫ్ దంత వైద్యశాల డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బీదా గణేశ్, గౌరవ చైర్మన్ కసుకుర్తి రామకృష్ణ, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రొటోకాల్ పాటించాలి

ఏలూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్ల పట్ల ప్రొటోకాల్ పాటించడం లేదని, కౌన్సిల్లో మాట్లాడే అవకాశం కల్పించడం లేదని నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వైసీపీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్ళపల్లి జైప్రకాశ్ ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టరేట్ వెట్రి సెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిబంధనలు పాటించడం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గుడిదేశి శ్రీనివాసరావు, మున్నుల జాన్ గురునాథ్, నూకపెయ్యి సుధీర్‌బాబు, తుమరాడ స్రవంతి, జి.నిర్మల, కేదారేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను పరిరక్షించాలి

కుక్కునూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పలు సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక హక్కులను, సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తాయన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు పోచారపు వెంకన్నబాబు, మోహనరావు, సుజాత, వరక శివ, శేఖర్, కాంతారావు పాల్గొన్నారు.

టీడీపీ ఆరోపణలపై వైసీపీ ఖండన

ఏలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరిపై కొల్లేరు, టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని దెందులూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తేరా ఆనంద్, కామిరెడ్డి నాని, ముంగర సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన వైసీపీ సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరవడంతో అది జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహించారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి

పోలవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కమ్మరగూడెంలో పారిశుధ్యం మెరుగుపర్చాలంటూ సోమవారం గ్రామస్థులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. హెబ్రోన్ చర్చి సందులో డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు, మురుగు నిలిచి రాకపోకలు సాగించే అవకాశం ఉండటం లేదు. మార్గం వీధి దుర్గంధంగా మారిందని పంచాయతీ అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు కడితాల రాజు, సంజయ్ అధికారులను కోరారు.

కషాయాల తయారీపై శిక్షణ

ఉంగుటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన పంట రక్షణకు సామూహిక కషాయాల తయారీపై నాచుగుంటలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా డి.పి.ఎం. బాలిన వెంకటేశ్ ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయింగ్ చేయించడానికి శిక్షణను నిర్వహించారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కుక్కునూరు మండలం గ్రామ శివారుల్లో అటవీ ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. మారేడుబాక, శ్రీధరవేలేరు గ్రామాల్లో గ్రామస్థులకు సారా తాగితే వచ్చే దుష్ఫలితాల గురించి వివరించారు. సారా తయారీపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వీఆర్వోల సంఘానికి భట్టు ఎన్నిక

కొయ్యలగూడెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): వీఆర్వో సంఘం మండలాధ్యక్షుడిగా కొయ్యలగూడెం భట్టు వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, జాయింట్ సెక్రటరీగా విజయకుమారి, ట్రెజరరీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు.

రైతులకు పశుగ్రాస విత్తనాలు

కొయ్యలగూడెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పశుగ్రాస విత్తనాలంతా రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గంజిమాల రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ విత్తనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన మండల కార్యదర్శి ఏపూరి సతీశ్, గొలిశెట్టి శ్రీను, సంకు మధు, బాబి పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తమ్మిలేరు ప్రాజెక్టు మధ్య కాలువకు నీటి విడుదల

చాట్రాయి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టు మధ్య కాలువకు సోమవారం ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు యర్రా రమేష్ పూజలు నిర్వహించి నీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ రెండు కాలువల కింద పోలవరం, చాట్రాయి, మర్లపాలెం, మంకొల్లు గ్రామాల్లో 4200 ఎకరాల అధికారిక ఆయకట్టు ఉందన్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, నాయకులు యర్రా హేమంత్ కుమార్, యర్రా ప్రసాద్, వెల్డి అప్పారావు, మొక్కపాటి మురళీ, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో వన మహోత్సవం

ముదినేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని విజయ ఫార్మసీ కళాశాలలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ తనూజ, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని, మానవాళికి స్వచ్ఛమైన ప్రాణ వాయువును అందించే చెట్లకే ఉందని ప్రిన్సిపాల్ అన్నారు. ఫార్మసీ విద్యార్థులతో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కూడా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.



సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

నూజివీడు టౌన్, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 9న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యదర్శి జి. రాజు అన్నారు. సోమవారం నూజివీడు పట్టణంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం 26వేలు నిర్ణయించి అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలనిఏఐటీయూసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు అన్నారు. జూలై 9న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సోమవారం నాడు నూజివీడు కోరమండల పెయింట్స్ ముఠా యూనియన్ సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

కైకలూరు: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం కైకలూరు ఉర్దూ పాఠశాలలో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. సమ్మెలో సీఐటీయూ అనుబంధ సంఘాలు, స్కీం వర్కర్లు, పంచాయతీ కార్మికులు, ఆటోడ్రైవర్లు, హమాలీ కార్మికులు, అంగన్వాడీలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకులు



ముసునూరు, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ముసునూరు ఎస్సీ కాలనీ ఎమ్మార్పీయస్ నియోజకవర్గ కన్వీనర్, తెలుగు యువత కార్యాదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి) ఆధ్వర్యంలో జరిగిన వేడకుల్లో టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, నాయకులు భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు తులిమెల్లి రంగరావు, తోట శ్రీనివాసరావు, నక్కా యోహాను, దేవినేని శ్రీధర్, తల్లిబోయిన సత్యనారాయణ, ఎమ్మార్పీయస్ నాయకులు చీలి అర్లప్ప, యువకులు పాల్గొన్నారు.

చాట్రాయి: ఎస్సీ వర్గీకరణ సాధన చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం చాట్రాయి మెయిన్ సెంటర్, సి. గుడిపాడు ఎస్సీ కాలనీలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సమితి అధ్యక్షుడు రవిరామ్, గార్లపాటి మారేష్, కొమ్ము ప్రసాద్, కొప్పుల ప్రసాద్, కోట జోషి, జాన్సేను, రాజు, రాజబాబు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత 'దివ్వెల'కు పురస్కారం



ముదినేపల్లి, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక రాష్ట్ర స్థాయి పురస్కారం ఈ ఏడాది ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు శివారు కొత్త దళితవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రచయిత దివ్వెల వెంకట నరసయ్యకు లభించింది. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం రాత్రి జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఈ పురస్కారాన్ని ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాము సత్యనారాయణ చేతులమీదుగా నరసయ్య అందుకున్నారు. అవార్డు గ్రహీతను విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్, కార్యదర్శి భవిరి రవి తదితరులు అభినందించారు.

శ్రీసిద్ధార్థ పూర్వ విద్యార్థినికి అవార్డు



నూజివీడు టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణానికి చెందిన శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిని వేంపటి విశాలినికి నృత్య రంగంలో ప్రతిభాపాటవాలు ప్రదర్శించినందుకు గాను శైవ అవార్డు అందుకున్నట్టు కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ జి. శ్రీమన్నారాయణ తెలిపారు. ఈమె తన చిన్ననాటి నుంచే నృత్యంలో ప్రతిభను కనబరచడమే కాక, పలు వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల ప్రశంసలు పొందింది. ఈమె తండ్రి ప్రముఖ నాట్య గురువు వేంపాటి మోహనరావు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ జి. శ్రీమన్నారాయణ, పట్టణ ప్రముఖులు ఆమెను అభినందించారు.



ముదినేపల్లిలో గృహ సంపర్క్ నిర్వహిస్తున్న కృష్ణారావు తదితరులు

మోదీ సుపరిపాలనపై ప్రచారం

ముదినేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గృహ సంపర్క్‌లో భాగంగా సోమవారం మోదీ నాయకత్వంలో 11 ఏళ్ల సుపరిపాలనపై ముదినేపల్లి బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి నరసింహారావు, వత్తుమిల్లి ప్రసాద్, మీసాల సత్య నారాయణ, కొల్లిపర నాగరాజు, బండారు పాండు రంగారావు, నచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు, కె.వెంకటపతి రాజు కరపత్రాలందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



కైకలూరులో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు



దేవపూడిలో సుపరిపాలనలో తొలి అడుగుపై ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



బోర్వంచలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



శోభనాపురం ప్రచారంలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు వేణు

రాష్ట్రానికి ఊపిరి పోస్తున్న చంద్రబాబు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నాయకులు

కైకలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో భారీగా నష్టపోయిన రాష్ట్రానికి సీఎం చంద్రబాబు ఊపిరి పోస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు. సోమవారం కైకలూరు టౌన్‌లో 127వ బూత్‌లో బూత్ కన్వీనర్ సబేరా బేగం ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అందరికీ అందుతు న్నదీ లేనిదీ తెలుసుకోవడమే గాక ప్రజలకు ఏమైనా ఇబ్బందులున్నాయా అని తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు. పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కూటమి ప్రభుత్వం పేదల మేలు కోసమే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. వడాలిలో సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, తెలుగు యువత నాయకుడు దావు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సీఎం చంద్రబాబు నాయుడు తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని టీడీపీ నూజివీడు మండలం బోర్వంచ గ్రామ అధ్యక్షులు పామర్తి వేణుగోపాలరావు అన్నారు. సోమవారం బోర్వంచలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలపై వివరించారు. పార్టీ మండల, క్లస్టర్ ఇన్‌చార్జిలతో పాటు పార్టీ వైస్ ప్రెసిడెంట్ బోయపాటి అంజిబాబు, మాజీ సర్పంచ్ గోవాడ ఎలిషా, నూజివీడు మండల ఐటీడీపీ అధ్యక్షులు బోస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఆగిరిపల్లి టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శోభనాపురంలో సోమవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు దాసరి సాయిరామ్, కార్యదర్శి పామర్తి ఆంజనేయులు, డీసీ వైస్ ఛైర్మన్ ఉప్పు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలు ఇవ్వకుండా అమ్ముకుంటారా..

మండవల్లి గ్రామసభలో అధికారులను నిలదీసిన గ్రామస్థులు



మండవల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

మండవల్లి జూలై 7(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా కుళాయిలు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం కోసం ఉచిత కుళాయి పంపిణీని నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ధ్వజమెత్తారు. మండవల్లి గ్రామసభ సర్పంచ్ మెండా రూన్సీ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డ్రెయినేజీ వ్యవస్థ, సంతమార్కెట్ స్థలాల ఆక్రమణ, ఇంటి పన్ను వ్యత్యాసం, చెత్తబండి ఇంటింటికి పంపకపోవడంపై నిలదీశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యుడు అప్పారావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల క్రితం జలజీవన్ మిషన్ పథకం కింద కుళాయిలేని ప్రతి ఇంటికి రూపాయికి కుళాయి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం మొగల్రాయ్ చెరువు మంచినీటి పథకానికి సుమారు రూ. 65 లక్షలు, కొండరాయి చెరువు మంచినీటి పథకానికి మరో రూ. 15 లక్షలు నిధులు మంజూరు చేసిందని అయినప్పటికీ గ్రామంలో ఇంతవరకు కుళాయిలు పంపిణీ చెయ్యకపోవడం పంచాయతీ నిర్లక్ష్యమేనన్నారు. పంచాయతీ నిర్లక్ష్యం కారణంగా కొండరాయి చెరువుకు కేంద్రం మంజూరు చేసిన రూ. 15 లక్షల నిధులు నిర్వీర్యమ య్యాయన్నారు. వ్యక్తిగత కొళాయిల కోసం గ్రామ స్థులు ఎన్నోఏళ్ళుగా ఎదురు చూస్తుంటే పట్టించు కోకుండా లక్షల్లో సొమ్ము చేసుకుని పంపులు ఇచ్చారని ఆరోపించారు. ఈ సందర్భంగా కార్యదర్శి గిరిజ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా కుళాయిలేని ప్రతీ ఇంటికి కుళాయి ఇచ్చేలా చర్యలు తీసుకుం టామని, అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడ తామన్నారు. టీడీపీ నాయకుడు గొల్లపూడి సత్తిబాబు, వీఆర్వో శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలిదిండి 'సుపరిపాలనలో' పాల్గొననున్న మంత్రి కొల్లు

కలిదిండి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మంగళవారం నిర్వహించనున్న సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర హాజరవుతారన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

9న స్థలాల లీజుపై సమావేశం

ఏలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కలిదిండి బస్‌స్టేషన్‌లో రెండు ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజు కిచ్చే నిమిత్తం పిలిచిన టెండర్లపై ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏలూరు డీపీటీవో కాన్ఫరెన్స్ హాల్లో ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారి షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పథకాలు అమలు చేయాలి

చాట్రాయి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చెయ్యాలని సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్, జిల్లా కార్యదర్శి డి. పుల్లారావు మాట్లాడుతూ అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 9న సార్వత్రిక సమ్మె విజయవంతం చెయ్యాలని కోరారు. లిబరేషన్ నాయకులు వేముల బక్కయ్య, చాట్ల బాబూరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం విజయవంతం చేయాలి

చాట్రాయి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమన్వయంతో విజయవంతం చెయ్యాలని ఎంఈవో బ్రహ్మచారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో 62 ప్రభుత్వ, 6 ప్రైవేటు, ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో మొత్తం 69 విద్యాలయాల్లో 4410 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఈ మెగా పీటీఎం 2.0 జరుగుతుందని ఎంఈవో వివరించారు.

ఎంఈవో-1గా రామ్మూర్తి



ముసునూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల ఎఫ్ఏసి ఎంఈవో-1గా టి.రామ్మూర్తి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవో-1గా విధులు నిర్వర్తిస్తున్న సేవ్యానాయక్ ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో నరసాపురం ఎంఈవోగా పనిచేస్తున్న రామ్మూర్తిని ఉన్నతాధికారులు ముసునూరు ఎంఈవో-1గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన రామ్మూర్తికి ఎంఈవో-2 బి.వి.యస్ సుబ్బారావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రభుత్వ సదుపాయాలు అందేలా కృషి చేస్తానని నూతన ఎంఈవో-1 రామ్మూర్తి అన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు ప్రారంభం

ముదినేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ముదినేపల్లి మండల శాఖ 2025-26 విద్యా సంవత్సరానికి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. మండలంలో నూతనంగా ఏర్పాటైన వైవాక జిల్లా పరిషత్ హైస్కూలులో ఉపాధ్యాయులకు యూనియన్ సభ్యత్వాల నమోదు పత్రాలను అందజేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షురాలు ఎం. సాయిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఐ. దుర్గా ప్రసాద్, జిల్లా కార్యదర్శి మస్తాన్‌రావు, ఈ ఏడాది యూనియన్ తొలి సభ్యత్వాన్ని వైవాక మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మోహనరావుకు అందజేశారు. తొలి రోజు మండలంలోని 15 పాఠశాలల్లో సభ్యత్వాల నమోదు నిర్వహించారు.

రూప్ చంద్ ధర పతనం

పట్టుబడితో నష్టం.. జాప్యమైతే మేత భారం!

- కిలో కనిష్ఠ ధర రూ.93
- వ్యాపారుల మార్జిన్ రూ.4
- పెట్టుబడి కూడా దక్కదు

నిడమర్రు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రూప్‌చంద్ చేపల ధర అత్యంత కనిష్ఠ స్థాయికి చేరడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. జూన్ ఆఖరి వారం నుంచి ధర పతనం అవుతోంది. వేసవిలో రైతు వద్ద కిలో రూ.128 పలికిన రూప్‌చంద్ చేప ధర ప్రస్తుతం రూ.95 ఉంది. ఒక కేజీకి సుమారు రూ.30 రైతు ధర కోల్పో తున్నాడు. కేజీ చేప పెంపకానికి రూ.95 నుంచి రూ.100 వరకు ఖర్చవుతుండడంతో సుమారు రూ.7 నష్టపోతున్నాడు. 10 టన్నుల సరుకు ఎగు మతికి సుమారు రూ.1.5 లక్షల నష్టం వస్తోంది.

సొమ్ము చెల్లిస్తేనే మేత

రూప్‌చంద్ చేప ధర కనిష్ఠ స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావ డం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభం నుంచి చేపల మేతకు ఫీడ్ కంపెనీలు, డీలర్లు పెట్టుబడి పెడుతున్నారు. పట్టుబడి అనంతరం రైతుకు సొమ్ము అందిన తర్వాత వారికి చెల్లిస్తారు. ప్రస్తు తం పట్టుబడి లేకున్నా చేపకు మేత వేయాల్సిం దే. సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతా మంటూ డీలర్లు షరతులు విధిస్తున్నారు. దీనితో రెండు రోజులకోసారి రైతులు మేత వేస్తున్నారు. ఈ కారణంతో చేప బరువు తగ్గి మరింత నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో రెండు నెలలు శ్రావణ మాసం పూజలు, వినాయకచవితి, దీపావళి అంటూ వచ్చే 5 నెలలు చేపల మార్కెట్‌కు గడ్డుకాలమే. మార్కెట్ మరింత తగ్గే అవకాశం ఉంటుందని ట్రేడర్స్ చెబుతున్నారు. పెరిగిన చేప నష్టానికి అమ్మలేక చేపల రైతు గట్టున పడ్డ చేపలా గిలగిలా కొట్టుకొంటున్నాడు. కనీసం



చెరువు లీజు సొమ్ము కూడా దక్కదని వాపోతున్నారు.

వ్యాపారుల మార్జిన్.. రైతుకు భారం

రూప్‌చంద్ చేప సైజును బట్టి ధర పలికేది. కేజీ ధరలో ట్రేడర్స్ ధర 1 గ్రాముకు 2 పైసలు చొప్పున కేజీ చేపకు వంద గ్రాములు మార్జిన్‌గా తీసుకుంటారు. ప్రస్తుతం రైతు పరిస్థితిని ఆసరా గా చేసుకున్న ట్రేడర్స్ మరింత కోత వేస్తున్నారు. మార్జిన్ రేటును 2 పైసల నుంచి 4 పైసలకు చేసి రైతులను దోచుకుంటున్నారు.

ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఒక కేజీ ధర రూ.93 పలికితే ట్రేడర్ మార్జిన్ వంద గ్రాములు పోను 900 గ్రాములకు రూ.89 ధర దక్కుతోంది. 1 గ్రాముకు 4 పైసల చొప్పున వంద గ్రాముల ధర రూ.4 మొత్తం కేజీ ధరలో కోత వేస్తున్నారు. మార్జిన్ మొత్తం తీసివేస్తే రైతుకు రూ.89 లభిస్తోంది. గతంలో 2 పైసలు ప్రస్తుతం 4 పైసలు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఆక్వా రైతుకు ధరాఘాతం

పట్టుబడుల వేళ ఒక్కసారిగా ధర కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని ప్రాంతాలలో 1 గ్రాముకు 4 పైసలు చొప్పున తక్కువ ధర కడుతుండడంతో కేజీ బేసిక్ ధరపై రూ.4 కోత పడుతోంది. ట్రేడర్స్‌తో మాట్లాడతాం.

-తాడినాడ బాబు, అధ్యక్షుడు,
ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్

ఆగుతూ.. సాగుతూ!



శింగాపురంలో రహదారి విస్తరణ కోసం తవ్వి పనులు చేపట్టకుండా వదిలేసిన దృశ్యం

(5వ పేజీ తరువాయి)

చేపట్టారు. ముదినేపల్లిలో రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షానికి రహదారిపై ప్రయాణించలేని పరిస్థితులు నెల కొన్నాయి. మండవల్లిలో నాలుగు లైన్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. అయితే అనేకచోట్ల భూ సమస్యలు తలెత్తడంతో గ్రామంలో డివైడర్ లేకుండా కొద్దిమేర నిర్మాణం చేశారు. రహదారిని కుదించి నిర్మాణం చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణంలో భూసేకరణ జరగని ప్రదేశాల్లో అష్టవంకర్లు తిప్పుతూ నిర్మాణం చేశారు. కొన్నిచోట్ల నిర్మాణాన్ని వదిలివేశారు.

పల్లెవాడలో ప్రారంభం కాని బైపాస్

కైకలూరు మండలం పల్లెవాడలో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిలో అనేక మలు పులు ఉండడంతో పూసపాటి అమ్మవారి ఆలయం నుంచి ఎలాంటి మలుపులు లేకుండా బైపాస్ నిర్మాణం చేసేందుకు ప్రణాళిక చేశారు. అందుకు కావాల్సిన భూసేకరణ జరిగిన ప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణపు పనులు చేపట్టలేదు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం చేయాల్సి ఉండగా నేటికీ పనులు ప్రారంభించలేదు.

పనులు పూర్తిచేయకుంటే ఆందోళన

ఐదేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా నేటికీ పూర్తికాలేదు. ఎక్కడికక్కడ రహదారి తవ్వేసి వదిలి వేయడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవిలో పనులు చేయ కుండా వర్షాకాలంలో పనులు ప్రారంభించి రెండు రోజుల్లో తూతూమంత్రంగా ముగించేస్తున్నారు. నిరంతరాయంగా విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేయకుంటే ఆందోళన చేస్తాం.

- కంతేటి సాయి, భుజబలపట్నం గ్రామస్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

ప్రైవేటుకు దీటుగా విద్యనందించండి
మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ

కలిదిండి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిం చాలన్నారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పిం చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సార్వాకు సాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పొలాలు ముం పు బారిన పడకుండా ఉండాలంటే మురుగు కాల్వల్లో పూడిక పనులు చేపట్టాలన్నారు. పలు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి చెరువుల్లో నీటిని పరీక్షలు జరిపించాల న్నారు. వైస్ ఎంపీపీ రాణి, ఎంపీడీవో ఫణీంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కైకలూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రహదారిలో కారు అడ్డుగా పెట్టారని దాడి చేసిన ఘటనలో పది మందిపై కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు తెలిపారు. మండలంలోని వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేష్, అతని తమ్ముడు, చెరువు కాపాలదారు ఆదివారం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకుని తిరిగి ఆలపాడు వైపు కారులో వస్తూ మార్గమధ్యంలో సర్కారు కాలువ వంతెనపై ఫోటోలు దిగేందుకు ఆగారు. ఆ సమయంలో భీమవరానికి చెందిన కొందరు కారుల్లో వస్తున్నారు. వంతెనపై కారు అడ్డుగా ఉండడంతో పదేపదే హారను కొట్టినా కారు తీయకపోవడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పి పంపించేశారు. అయినా ఆలపాడు గ్రామంలోని పెట్రోలు బంకు వద్ద ఘంటసాల సురేష్ కారుకు అడ్డుగా పెట్టి అతనిపై ముకుమ్మడిగా భీమవరానికి చెందిన వారు దాడి చేశారు. ఈ దాడిలో సురేష్, అతని చెరువు కాపలాదారుకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో స్థానికులు వారిని కైకలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువెళ్లారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు భీమవరానికి చెందిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం చిగురుకోట శివారు నరసన్నపాలెంకు చెందిన బాలిక (17) అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాలిక గత ఏడాది పదవ తరగతి పాస్ కాకపోవడంతో తల్లితోపాటు కూలి పనులకు వెళుతోంది. ఎప్పటిలాగానే పనులకు వెళ్లి వచ్చిన ఆ బాలిక ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించింది. సోమవారం వేకువ జామున బాలిక తల్లి నిద్ర లేచి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. గ్రామంలోనూ, చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హెడ్‌కానిస్టేబుల్ శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట శివారులో జరుగుతున్న భారీ పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు సోమవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 4400 నగదు, 14 బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.